




సమాజ హితం – మా అభిమతం

www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

RNI NO. TEL TEL/2023/89778








రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 223 పేజీలు : 12, వెల రూ. 5/- సోమవారం, అక్టోబరు 5, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA


# ఓటు హక్కును హరించడం రాజ్యాంగ విరుద్ధం

**కోట్లాది మందిని ఓటు హక్కుకు దూరం చేయడం ఏకపక్ష చర్యే**

**ఓటు హక్కు పౌరసత్వానికి ప్రాణం.. నోటీసు ఇవ్వకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించరాదు**

**నల్సార్ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ స్పష్టీకరణ**



హైదరాబాద్: ఓటు హక్కు భారత పౌరసత్వానికి ప్రాణప్రదమని, కోట్లాది మంది పౌరులను ఓటు హక్కుకు దూరం చేసే ఏ ప్రక్రియనూ సమర్థించలేమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ స్పష్టం చేశారు. ఓటు హక్కును హరించే చర్యలు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లో పొందుపరిచిన సమానత్వపు హక్కు, ఆర్టికల్ 326లోని వయోజన ఓటు హక్కుల స్ఫూర్తికి భంగం కలిగించేలా వ్యవహరించరాదని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 19వ నల్సార్--జస్టిస్ బీఆర్ సాహ్ని మెమోరియల్ మూట్ కోర్టు పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఓటు హక్కును కోల్పోయిన పౌరులు సొంత దేశంలోనే ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడితే, అలాంటి ప్రక్రియను ఏ కారణంతోనూ సమర్థించలేమని జస్టిస్ భూయాన్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగం పౌరులను ఓటు హక్కు కలిగినవారు, లేనివారుగా విభజించడాన్ని అంగీకరించదన్నారు. కోట్లాది మంది ఓటు హక్కును హరించే చర్యలు ఏకపక్షంగా మారడమే కాకుండా, రాజ్యాంగ పునాదులనే దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పాలనలో సామాన్య పౌరుడు భాగస్వామి కావడానికి ఓటు హక్కు అత్యంత కీలకమని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అన్నారు. ఓటు హక్కు ద్వారా ప్రజలు తమ పాలకులను ఎన్నుకుని, ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములవుతారని వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 కల్పించిన వయోజన ఓటు హక్కు ప్రాధాన్యాన్ని గుర్తించాలని సూచించారు. రాజ్యాంగానికి అతీతంగా ఎవరూ వ్యవహరించలేరని, ఏ అధికార సంస్థకూ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించే అధికారం లేదని స్పష్టం చేశారు. గతంలో కొన్ని తీర్పుల్లో ఓటు హక్కు ప్రాథమిక హక్కు కాదని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూనే, 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో వెల్లడైన అంశాలను ఆయన వివరించారు. ఓటు హక్కు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కు అని, ఆర్టికల్ 326 ఈ హక్కుకు చట్టబద్ధమైన ఆధారమని పేర్కొన్నారు. పరిపాలనా ప్రక్రియల పేరుతో పౌరుల ఓటు హక్కును

మిగతా 2వ పేజీలో



## పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం

**కేంద్రంతో సంప్రదించి వివాదాలను పరిష్కరిస్తాం**

**పేదలకు రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు.. అవసరమైతే నాలుగో విడతలోనూ మంజూరు**

**కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

లక్ష్మీదేవిపల్లి: పోడు భూములకు సంబంధించి వివాదాస్పదంగా మారుతున్న సమస్యలను త్వరలోనే పరిష్కరించి, శాశ్వత పరిష్కారం చూపుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అటవీ భూములకు సంబంధించిన కొన్ని అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున, కేంద్రంతో సంప్రదింపులు జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం

మిగతా 2వ పేజీలో



## తెలంగాణకు బీసీ సీఎం..

**టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్**

**బీసీ సీఎం కావడానికి రాహుల్, రేవంత్ మద్దతు**

**హక్కుల సాధనకు వెనక్కి తగ్గేది లేదు..**

**అవసరమైతే పోరాడి సాధించుకుంటాం**

**ఓబీసీ గర్జన సభలో కాంగ్రెస్ నేతల స్పష్టీకరణ**

శంషాబాద్: తెలంగాణలో భవిష్యత్తులో బీసీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బీసీ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్దతు ఉంటుందని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం నాయకత్వంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే ఇచ్చిన ధైర్యంతోనే ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నానని పేర్కొన్నారు. ఆదివారం శంషాబాద్ మండలం తొండుపల్లిలో టీపీసీసీ ఓబీసీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ ఓబీసీ గర్జన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్ని వర్గాల మద్దతుతో బీసీలకు దక్కాల్సిన హక్కులను సాధిస్తామని, అవసరమైతే పోరాడి మరీ వాటిని దక్కించుకుంటామని మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. గతంలో పీవీ నర్సింహారావు, చెన్నారెడ్డి వంటి నేతలు చరిత్రలో నిలిచిపోయిన విధంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టి, అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపారని గుర్తుచేశారు. అయితే బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర బీజేపీ నాయకులు స్పందించడం లేదని విమర్శించారు. బీసీలకు సామాజిక న్యాయం కల్పించడంలో

మిగతా 2వ పేజీలో

## విమానాన్ని కూల్చేయాలనుకున్నా



**దుబాయ్ కోపైలట్ వాంగ్మూలం**

**విచారణలో నేరాన్ని అంగీకరించిన హమామ్ అల్-హమామీ**

**కెప్టెన్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి దాడి చేశానని వెల్లడి**

**హమామ్ సోషల్ మీడియాలో వేలకొద్దీ ఉగ్రవాద పోస్టుల గుర్తింపు**

**ఈ కుట్ర వెనుక ఉగ్రసంస్థల హస్తంపై ఇజ్రాయెల్, సౌదీ ఏజెన్సీల దర్యాప్తు**

## 3డీ ప్రింటింగ్ తో పేదల ఇళ్లు.. చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు

**రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం**

**మరో 6 లక్షల ఇళ్ల మంజూరుకు కేంద్రమంత్రి హామీ**

**బుర్రిపాలెంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో పైలట్ ప్రాజెక్టు**

**2029 నాటికి పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామన్న సీఎం చంద్రబాబు**

**ఏపీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్ అన్న శివరాజ్‌సింగ్ చౌహాన్**



ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ రంగంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అత్యాధునిక 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో వేగంగా, పటిష్టంగా, తక్కువ ఖర్చుతో ఇళ్లను నిర్మించే బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో, ఏకంగా 9 లక్షల ఇళ్లను నిర్మించి పేదలకు పట్టాభిషేకం చేయాలని సంకల్పించింది. ఈ మహాయజ్ఞంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల

మిగతా 2వ పేజీలో



**రేవంత్‌రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి**

## చంద్రబాబుకు పంపిస్తున్నాడు: కవిత

**కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ**

**రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్**

**రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న**

**కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు

మిగతా 2వ పేజీలో

## గాల్లోనే ఢీకొట్టిన పక్షి.. ఇండిగో విమానానికి తప్పిన పెను ప్రమాదం!

**పుణే నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బర్డ్ హిట్**

**పైలట్ చాకచక్యంతో శంషాబాద్‌లో సురక్షిత ల్యాండింగ్**

**విమానం ముందు భాగంలో సొట్ట పడినట్లు గుర్తింపు**



**కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటి ప్లాన్‌లో భారీ మార్పు..**

## ఫ్లైఓవర్ల స్థానంలో ఒకే కారిడార్!

**కేబీఆర్ పార్క్ చుట్టూ మౌలిక సదుపాయాల ప్రణాళికలో మార్పు**

**బహుళ ఫ్లైఓవర్ల స్థానంలో ఒకే భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం**

**పంజాగుట్ట ఎన్‌ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు కారిడార్**

**కొత్త ప్రతిపాదనకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ**

**ఐటీ కారిడార్ వైపు సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కల్పించడమే లక్ష్యం**




హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని కేబీ ఆర్ నేషనల్ పార్క్ చుట్టూ ప్రతి ష్ఠాత్మకంగా చేపట్టాలనుకున్న హెచ్-సిటి (హైదరాబాద్ క్రియే టివ్, టెక్నాలజీ అండ్ ఇన్నో వేషన్) ఇన్‌ఫ్రా ప్రాజెక్టులో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొ రేషన్ (జీహెచ్‌ఎంసీ) కీలక మా ర్పులు చేసింది. గతంలో ప్రతిపా దించిన పలు ఫ్లైఓవర్లు, అండం ర్‌పాస్‌ల స్థానంలో ఒకే భారీ ఎలివే టెడ్ కారిడార్‌ను నిర్మించాలని

మిగతా 2వ పేజీలో

# ఓటు హక్కును హరించడం రాజ్యాంగ విరుద్ధం

హేతుబద్ధత లేకుండా తొలగించడం సరికాదన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించే విషయంలో ప్రజా ప్రాతినిధ్య చట్టం--1950లోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని జస్టిస్ భూయాన్ సూచించారు. ఓటరు మరణించిన సందర్భం మినహా, ఓటర్ల జాబితాలో నమోదైన వ్యక్తి పేరును తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి నోటీసు ఇవ్వడంతోపాటు, వివరణ ఇచ్చుకునేందుకు తగిన అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, వివరణ వినకుండా ఓటు హక్కును తొలగించడం ఏకపక్ష చర్యగా మారుతుందని అన్నారు. ఒక భారతీయ పౌరుడి గుర్తింపు నుంచి ఓటు హక్కును, ఓటర్ల జాబితాలో ఉండే హక్కును వేరు చేయలేమని జస్టిస్ భూయాన్ వ్యాఖ్యానించారు. పౌరుడికి ఓటు హక్కు లేకుండా చేయడం శరీరం నుంచి ఆత్మను వేరు చేయడంతో సమానమని అభివర్ణించారు. ఓటర్ల జాబితాల సవరణ వంటి ప్రక్రియలు పారదర్శకంగా, న్యాయబద్ధంగా సాగాలని, పౌరుల హక్కులకు భంగం కలగకుండా చూడాలని సూచించారు. ఓటు హక్కుపై జస్టిస్ ఉజ్జల్ భూయాన్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్వాగతించారు. ఓటు హక్కు రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో అంతర్భాగమని సిట్టింగ్ న్యాయమూర్తి ధైర్యంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం ప్రాధాన్యమైన విషయమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో రాజ్యాంగ నిబంధనలను పాటించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని గుర్తుచేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వ్యవహారశైలిపై విమర్శలు గుప్పిస్తూ, ఆయన తన పదవిలో కొనసాగడానికి నైతిక హక్కును కోల్పోయారని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సైతం జస్టిస్ భూయాన్ వ్యాఖ్యలను అభినందించారు. పదవిలో కొనసాగుతున్న సిట్టింగ్ న్యాయమూర్తి అధికార వ్యవస్థను ప్రశ్నిస్తూ, పౌరుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై నిర్భయంగా మాట్లాడటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేసిన జస్టిస్ భూయాన్ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.



# విమానాన్ని కూల్చేయాలనుకున్నా: ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

**ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేయాలన్నది తన ప్లానేనన్న కోపైలట్**

**విచారణలో నేరాన్ని అంగీకరించిన హమామ్ అల్-హమామీ**

**కెప్టెన్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి దాడి చేశానని వెల్లడి**

**హమామ్ సోషల్ మీడియాలో వేలకొద్దీ ఉగ్రవాద పోస్టుల గుర్తింపు**

**ఈ కుట్ర వెనుక ఉగ్రసంస్థల హస్తంపై ఇజ్రాయెల్, సౌదీ ఏజెన్సీల దర్యాప్తు**



ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్-హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు. చావంటే తనకు ఏమాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు. ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చుర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో (ఎత్తుంప్ర ఖఇవ) దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యూఏఈలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు. సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.

# 3డీ ప్రింటింగ్‌తో పేదల ఇళ్లు.. చంద్రబాబు సర్కారు వినూత్న ముందడుగు

ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ గృహ నిర్మాణ యజ్ఞంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ. దేశంలోనే తొలిసారిగా భారీ ఎత్తున ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీబీఆర్ఐ) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం బుర్రిపాలెంలో రూ.14 కోట్ల వ్యయంతో 177 ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్‌లకు అధికారులు టెక్నాలజీ గురించి వివరించారు. ఈ విధానంలో కేవలం 10 రోజుల్లోనే ఒక ఇంటి నిర్మాణం పూర్తి చేయవచ్చని, ఇది ఎంతో పటిష్టంగా ఉంటుందని తెలిపారు. ఈ ఇళ్లలో బయటి వాతావరణంతో పోలిస్తే ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, ఇది పేదలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో చేపడుతున్న ఈ 3డీ గృహ నిర్మాణం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. పేదలకు సొంతిల్లు వారి ఆత్మగౌరవాన్ని పెంచుతుందని, ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి సాధారణ కోటా కింద 75 వేల ఇళ్లు మాత్రమే ఉండగా, తన విజ్ఞప్తి మేరకు కేంద్రం 3 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని చెప్పారు. ఈ 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలోపే మరో 3 లక్షలు, వచ్చే ఏడాది ఇంకో 3 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, మొత్తంగా 9 లక్షల ఇళ్లకు కేంద్రం సహకరిస్తోందని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 6 లక్షల ఇళ్లను రద్దు చేశారని, నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో స్థలాలు ఇచ్చి పేదలను మోసం చేశారని విమర్శించారు.

**షైనింగ్ ఆంధ్రాగా ఏపీ: శివరాజ్‌సింగ్ చౌహాన్**

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. విజనరీ నేత చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఇక "షైనింగ్ ఆంధ్రా, అడ్వాన్స్‌డ్ ఆంధ్రా, అచీవింగ్ ఆంధ్రా"గా మారబోతోందని కొనియాడారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న చంద్రబాబు సంకల్పం గొప్పదని ప్రశంసించారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు అందిస్తున్నారని, రాష్ట్రంలోని అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు సుఖంగా ఉండాలనే విధానంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి చౌహాన్.. ఒక లబ్ధిదారురాలి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, వారికి నూతన వస్త్రాలు అందించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. వేదికపై లక్ష్మీ అనే మహిళకు ఇంటి పట్టాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## గాల్లోనే ఢీకొట్టిన పక్షి.. ఇండిగో విమానానికి తప్పిన పెను ప్రమాదం!

పుణె నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. విమానం గాల్లో ఉండగా ఒక పక్షి బలంగా ఢీకొట్టింది. వెంటనే అప్రమ త్తమైన పైలట్ అత్యంత చాకచక్యంగా విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమా నాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రయాణికులు, సిబ్బంది ఊపిరి పీల్చు కున్నారు. వివరాల్లోకి వెళితే.. ఇండిగోకు చెందిన '6ఈ352' విమానం పుణె నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. దీంతో పైలట్ వెంటనే పరిస్థితిని అదుపులోకి తీసుకుని, ఎలాంటి ఇబ్బంది లేకుండా శంషా బాద్ విమానాశ్రయంలో విమానాన్ని దించారు. ల్యాండింగ్ అనంతరం నిపుణులు వి మానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విమానం ముందు భాగంలో సొట్ట పడ ినట్లు గుర్తించారు. పక్షి ఢీకొనడం వల్లే ఇలా జరిగిందని ప్రాథమికంగా నిర్ధారిం చారు. పైలట్ సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్లే పెను ప్రమాదం తప్పిందని అధి కారులు తెలిపారు. మరోవైపు, విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా చండీగఢ్ వెళ్లాల్సిన సర్వీసును రద్దు చేస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు ప్రకటించారు.

# ఫ్లైదుబాయ్ ఘటన తరహాలో దాడులు చేయండి.. అల్ ఖైదా మద్దతు పత్రిక పిలుపు



అంతర్జాతీయంగా మరోసారి ఉగ్రవాద దాడుల కలకలం రేగింది. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన విమానాలపై దాడులు చేయాలంటూ అల్ ఖైదా మద్దతుదారులు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన ఫ్లైదుబాయ్ విమాన హైజాక్ యత్నాన్ని, 2001 సెప్టెంబర్ 11 దాడులను స్ఫూర్తిగా తీసుకుని 'కాపీక్యాట్ దాడులు' (అచ్చం అలాంటి దాడులే) చేయాలని తమ పత్రిక ముఖంగా రెచ్చగొట్టారు. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా భద్రతా ఏజెన్సీలను అప్రమత్తం చేసింది. అల్ ఖైదా మద్దతుతో నడుస్తున్న 'అల్ బయాన్' అనే అరబిక్ వారపత్రిక ఈ మేరకు ఓ కథనాన్ని ప్రచురించింది. "యుద్ధం ఇంకా ముగియలేదు. జియోనిస్టులు, అమెరికన్లు, ఇస్లాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఇతర అవిశ్వాసులను మోసుకెళ్లే విమానాలు ఇంకా ఆకాశంలో ఎగురుతూనే ఉన్నాయి. సెప్టెంబర్ 11, సెప్టెంబర్ 30న జరిగినట్లుగా వాటిని లక్ష్యంగా చేసుకోవచ్చు" అని ఆ కథనంలో పేర్కొన్నారు. 9/11, ఫ్లైదుబాయ్ ఘటనలకు సంబంధించిన చిత్రాలను కూడా దీనికి జోడించారు. కొద్ది రోజుల క్రితం దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని నేలకూల్చేందుకు విఫలయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఆ విమాన కో-పైలట్, కాక్‌పిట్‌లోని గొడ్డలితో కెప్టెన్‌పై దాడి చేసి విమానాన్ని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో విమానం వేగంగా కిందకు దూసుకెళ్లి పెను ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. ఈ హైజాక్ యత్నానికి పాల్పడిన కో-పైలట్ ఒమన్‌కు చెందినవాడని, అతనికి తీవ్రవాద భావజాలం ఉందన్న కారణంతో గతంలోనే ఒమన్ అధికారులు విమానాలు నడపకుండా నిషేధం విధించారని దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలోనే అల్ ఖైదా మద్దతుదారులు ఈ ఘటనను ఓ విజయంగా చిత్రిస్తూ దాడులకు పిలుపునివ్వడం గమనార్హం. శనివారం టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ పోస్ట్ సర్క్యులేట్ అయినప్పటికీ, ఆ తర్వాత దానిని తొలగించినట్లు తెలుస్తోంది.

## పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం



గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని పనులను తమ ప్రభుత్వం చేస్తుంటే, ఆ పార్టీ నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లను అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. అవసరమైతే నాలుగో విడతలోనూ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు బృందాలుగా ఏర్పడి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడి పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేయించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ తదితరులు హాజరయ్యారు.

# తెలంగాణకు బీసీ సీఎం..

కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా ఇటీవల జరిగిన సర్పంచి, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ తరఫున 57 శాతం సీట్లను బీసీలకు కేటాయించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతోపాటు మంత్రి పదవుల్లోనూ బీసీలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని, ఆయన నాయకత్వంలో బీసీ రిజర్వేషన్ల సాధన మరింత సులభమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీల హక్కుల కోసం పోరాడుతున్న నాయకుడిగా రాహుల్‌గాంధీ నిలుస్తారని పేర్కొన్నారు. బీసీల సంక్షేమం, అభ్యున్నతి కోసం కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలు కీలకమైనవని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. జనగణనలో కులగణనను కూడా చేర్చేలా ఓబీసీ వర్గాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యం దక్కేలా సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సభలో ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీలు మధుయాష్కీ గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, సురేష్ షెట్కార్, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బీసీల హక్కులు, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఓబీసీ గర్జన సభకు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల హైకోర్టు అనర్హత వేటు వేసిన దానం నాగేందర్ మాత్రం సభకు హాజరై ప్రసంగించారు. బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యంపై కాంగ్రెస్ నేతలు గళమెత్తిన ఈ సభకు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, ఓబీసీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

**కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటి ప్లాన్‌లో భారీ మార్పు..**

# ఫ్లైఓవర్ల స్థానంలో ఒకే కారిడార్!

నిర్ణ యించింది. పంజాగుట్ట-బంజారా హిల్స్ నుంచి జూబ్లీహిల్స్ వైపు రవాణా సౌకర్యాన్ని మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. ఈ సవరించిన ప్రతిపాదనకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం కొత్త డిజైన్లు, వ్యయ అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను కమిటీ ఆదేశించింది. తాజా ప్రతిపాదన ప్రకారం, పంజాగుట్ట సమీపంలోని ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ప్రాంతం వరకు సుమారు 4 కిలోమీటర్ల పొడవున ఆరు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. దీని ద్వారా జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ-మాదాపూర్ ఐటీ కారిడార్ వైపు వాహనదారులు ఎలాంటి సిగ్నల్స్ లేకుండా వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. కేబీఆర్ పార్క్ చుట్టూ హెచ్-సిటి ప్రాజెక్టులో ఇది ఒక ప్రధానమైన మార్పు. గతంలో పార్క్ చుట్టూ ఉన్న కీలక జంక్షన్ల వద్ద జీహెచ్ఎంసీ పలు స్టీల్ ఫ్లైఓవర్లు, డైరెక్షనల్ అండర్‌పాస్‌లను నిర్మించాలని ప్లాన్ చేసింది. ప్యాకేజీ I, II కింద అంచనా వ్యయం మొదట రూ. 826 కోట్లు కాగా, తర్వాత అది రూ. 1,090 కోట్లకు పెరిగింది. అయితే, ఈ ఏడాది ఆగస్టులో కేబీఆర్ పార్క్ చుట్టూ క్లాక్‌వైజ్ వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని ప్రవేశపెట్టారు. నిర్మాణ పనుల కోసం తాత్కాలికంగా మొదలుపెట్టిన ఈ విధానం వల్ల ట్రాఫిక్ కదలికలు మెరుగుపడినట్లు అధికారులు గుర్తించారు. దీంతో, తొలుత ప్రతిపాదించిన అన్ని గ్రేడ్ సెపరేటర్లు అవసరమా అనే దానిపై పునరాలోచనలో పడ్డారు. దీనికి తోడు, పాత ప్రాజెక్టుకు పర్యావరణ, న్యాయపరమైన చిక్కులు కూడా ఎదురయ్యాయి. కేబీఆర్ పార్క్ ఎకో-సెన్సిటివ్ జోన్ పరిధిలో చెట్ల నరికివేత, తరలింపుపై స్టే రావడంతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ తన ప్రణాళికను సవరించింది. ప్రస్తుతానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపినప్పటికీ, ఇది తుది నిర్మాణ ప్రణాళిక కాదు. దీనికి సంబంధించిన పూర్తిస్థాయి ఇంజనీరింగ్ డిజైన్లు, సవరించిన వ్యయ అంచనాలు ఇంకా సిద్ధం కావాల్సి ఉంది. అనంతరం ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపి, ఈపీసీ కమిటీ, జీహెచ్ఎంసీ జనరల్ బాడీ ముందు ఉంచుతారు. ఈ మార్పులతో హైదరాబాద్‌లోని అతిపెద్ద రోడ్డు ఇన్‌ఫ్రా ప్రాజెక్టులలో ఒకటైన హెచ్-సిటి స్వరూపం గణనీయంగా మారనుంది.

## రేవంత్‌రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు: కవిత



తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పతనం.. బూమ్ నుంచి బేరిష్ దిశగా!

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం కొన్నేళ్లుగా దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన మార్కెట్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఐటీ రంగం విస్తరణ, బహుళజాతి సంస్థల పెట్టుబడులు, పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వెరసి నగరంలో భూములు, ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా కోకాపేట, నార్సింగి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ ధరలు గణనీయంగా పెరిగాయి. ఒకప్పుడు మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉన్న అనేక ప్రాంతాల్లో ఇప్పుడు ఇళ్ల ధరలు అందనంత ఎత్తుకు చేరాయి. అయితే, నిరంతరం పెరుగుతాయనే అంచనాలతో సాగిన రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఇప్పుడు మందగమన సంకేతాలు కనిపిస్తున్నాయనే చర్చ మొదలైంది. కొనుగోలుదారులు ఆచితూచి వ్యవహరిస్తుండటం, అధిక ధరలు, గృహ రుణాల భారం, పెట్టుబడిదారుల ఆసక్తిలో మార్పులు వంటి అంశాలు మార్కెట్ ఉత్సాహాన్ని ప్రభావితం చేస్తున్నాయి. గతంలో ప్రాజెక్టు ప్రారంభ దశలోనే ఫ్లాట్లు విక్రయమయ్యే పరిస్థితి ఉండగా, ఇప్పుడు కొన్ని ప్రాజెక్టుల్లో అమ్మకాలు నెమ్మదిస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మార్కెట్ మొత్తం కుప్పకూలిందని చెప్పడం కంటే, కొన్ని ప్రాంతాలు, ధరల విభాగాలు, ప్రాజెక్టుల్లో డిమాండ్ తగ్గడం, మరికొన్ని చోట్ల స్థిరత్వం కొనసాగడం వంటి భిన్నమైన పరిస్థితులను గుర్తించడం అవసరం. రియల్ ఎస్టేట్ రంగంలో మందగమనం ఏర్పడితే దాని ప్రభావం కేవలం బిల్డర్లు, పెట్టుబడిదారులకే పరిమితం కాదు. నిర్మాణ కార్మికులు, సిమెంట్, స్టీల్ పరిశ్రమలు, విద్యుత్తు పరికరాల తయారీదారులు, ఇంటీరియర్ డిజైనర్లు, రవాణా రంగం, బ్యాంకింగ్ వ్యవస్థలపైనా పడుతుంది. అందువల్ల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న మార్పులను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

నిల్వ ఉన్నప్పటికీ ధరలు తగ్గకపోవడానికి అనేక కారణాలున్నాయి. భూముల కొనుగోలు కోసం బిల్డర్లు అధిక మొత్తాలను వెచ్చించడం, నిర్మాణ వ్యయాలు పెరగడం, ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక వ్యయాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ఖర్చులు ధరలను ప్రభావితం చేస్తున్నాయి. అంతేకాకుండా, అధిక ధరలకు భూములు కొనుగోలు చేసిన బిల్డర్లు మార్కెట్ మందగించిందనే కారణంతో వెంటనే ధరలు తగ్గించడానికి ఇష్టపడటం లేదు. ధరలను తగ్గించడం వల్ల తమ ప్రాజెక్టుల విలువ తగ్గుతుందని, ఇప్పటికే కొనుగోలు చేసిన వినియోగదారుల్లో అసంతృప్తి ఏర్పడుతుందని కొందరు భావిస్తున్నారు. కానీ కొనుగోలుదారుల ఆలోచనా విధానంలో మార్పు వస్తోంది. గతంలో ధరలు ఇంకా పెరుగుతాయనే అంచనాతో ముందుగానే ఇళ్లు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ధరలు మరింత తగ్గుతాయా? వడ్డీ రేట్లు ఎలా ఉంటాయి? ఉద్యోగ భద్రత ఎంతవరకు ఉంటుంది? అనే అంశాలను పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా పెట్టుబడి కోసం ఇళ్లు కొనుగోలు చేసేవారు అద్దె ఆదాయం, భవిష్యత్తులో వచ్చే లాభాలు, నిర్వహణ ఖర్చులను లెక్కిస్తున్నారు. అంచనా వేసిన లాభాలు కనిపించకపోతే కొనుగోలును వాయిదా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బిల్డర్లు ప్రకటించే భారీ ధరలకు, కొనుగోలుదారులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్న మొత్తానికి మధ్య అంతరం పెరుగుతోంది. ఈ అంతరం తగ్గకపోతే అమ్మకాలు మరింత మందగించే ప్రమాదం ఉంది.

### ఐటీ రంగంలో అనిశ్చితి.. రియల్ ఎస్టేట్‌పై ప్రభావం

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అభివృద్ధికి ఐటీ రంగం ప్రధాన చోదకశక్తిగా నిలిచింది. మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, నానక్‌రామ్‌గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్, బహుళజాతి సంస్థలు, అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు (జీసీసీలు) విస్తరించడంతో వేలాది మంది ఉద్యోగులు నగరానికి వచ్చారు. వీరిలో అధిక శాతం మంది సొంత ఇళ్ల కొనుగోలుపై ఆసక్తి చూపడంతో పశ్చిమ హైదరాబాద్‌లో గృహ నిర్మాణ రంగం వేగంగా విస్తరించింది. అయితే, అంతర్జాతీయంగా ఐటీ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు ఈ మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. ఉద్యోగాల కోతలు, కొత్త నియామకాల మందగమనం, కృత్రిమ మేధ ప్రభావంపై ఆందోళనలు, కొన్ని సంస్థల్లో వ్యయ నియంత్రణ చర్యలు ఉద్యోగుల్లో అనిశ్చితిని పెంచుతున్నాయి. అధిక వేతనాలు పొందుతున్న ఉద్యోగులు సైతం భవిష్యత్తులో తమ ఉద్యోగాలకు భద్రత ఉంటుందా అనే సందేహంతో భారీ గృహ రుణాలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. సాధారణంగా ఒక ఉద్యోగి సొంత ఇంటి కొనుగోలు నిర్ణయం తీసుకునేటప్పుడు ప్రస్తుత ఆదాయంతో పాటు భవిష్యత్తులో వచ్చే ఆదాయం, ఉద్యోగ స్థిరత్వం, కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, వైద్య ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకుంటాడు. ఉద్యోగ భద్రతపై అనిశ్చితి ఏర్పడితే ఈ నిర్ణయం వాయిదా



పడుతుంది. హైదరాబాద్‌లో అధిక ధరల గృహాలకు ప్రధాన కొనుగోలుదారులుగా ఉన్న ఐటీ ఉద్యోగుల నుంచి డిమాండ్ తగ్గితే ప్రీమియం గృహాల విక్రయాలపై ప్రభావం పడటం సహజం. ఐటీ రంగంలో నియామకాల మందగమనం, ఉద్యోగుల ఆదాయంపై ఆందోళనలు సాంకేతిక నగరాల్లో గృహ విక్రయాలను ప్రభావితం చేస్తున్నాయని మార్కెట్ పరిశీలకులు పేర్కొంటున్నారు. అయితే, ఉద్యోగాల పరిస్థితి ఒక్కటే హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మందగమనానికి కారణం కాదు. అధిక ధరలు, కొత్త ప్రాజెక్టుల సరఫరా, కొనుగోలుదారుల ఆర్థిక సామర్థ్యం, పెట్టుబడులపై వచ్చే రాబడులు వంటి అంశాలన్నీ కలిపి మార్కెట్ ధోరణిని నిర్ణయిస్తున్నాయి.

### పశ్చిమ హైదరాబాద్‌లో ధరల భారమే ప్రధాన సమస్య

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో పశ్చిమ ప్రాంతాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందాయి. ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉండటం, అంతర్జాతీయ సంస్థలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, మెరుగైన రహదారి సదుపాయాలు అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంతాల్లో గృహాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని భూముల ధరలు, నిర్మాణ ప్రాజెక్టుల ధరలు క్రమంగా పెరిగాయి. కోకాపేట, నార్సింగి, నానక్‌రామ్‌గూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో విలాసవంతమైన అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, భారీ నివాస సముదాయాలు పెద్ద సంఖ్యలో నిర్మితమవుతున్నాయి. అయితే, ఈ ప్రాజెక్టుల్లో చాలా వరకు అధిక ఆదాయం కలిగిన కొనుగోలుదారులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఫలితంగా మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండే గృహాల సంఖ్య, వాటి ధరల మధ్య వ్యత్యాసం పెరుగుతోంది. ఒకప్పుడు ఐటీ ఉద్యోగులు తమ కార్యాలయాలకు సమీపంలోనే సొంత ఇల్లు కొనుగోలు చేయగలిగేవారు. ఇప్పుడు అదే ప్రాంతాల్లో ఇళ్ల ధరలు భారీగా పెరగడంతో వారు నగర శివారు ప్రాంతాల వైపు చూస్తున్నారు. అయితే అక్కడ కూడా భూముల ధరలు పెరగడం, రవాణా సదుపాయాల పరిమితులు, కార్యాలయాలకు దూరం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ధరలు పెరుగుతున్నాయనే అంచనాలతో కొందరు పెట్టుబడిదారులు ముందుగానే ఇళ్లు కొనుగోలు చేసినా, వాటిని అద్దెకు ఇవ్వడం ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం పొందలేకపోతున్నారు. గృహ రుణ వడ్డీ, నిర్వహణ ఖర్చులు, ఆస్తి పన్ను, ఇతర వ్యయాలను పరిగణనలోకి తీసుకుంటే అద్దె ద్వారా వచ్చే రాబడి తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడి కోసం కొనుగోలు చేసిన ఆస్తులపై ఆసక్తి తగ్గవచ్చు.

### కోకాపేట నుంచి శివారు ప్రాంతాల వరకు.. భిన్నమైన పరిస్థితులు

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను ఒకే కోణంలో పరిశీలించడం సరికాదు. నగరంలోని ప్రతి ప్రాంతంలో ఒకే రకమైన పరిస్థితులు లేవు. ఐటీ కారిడార్‌కు సమీపంలోని ప్రీమియం ప్రాజెక్టులు, మధ్యతరగతి గృహ సముదాయాలు, నగర శివార్లలోని ప్లాట్ల మార్కెట్, వాణిజ్య ఆస్తుల విభాగాలు వేర్వేరు ధోరణులను ప్రదర్శిస్తున్నాయి.

# ఫ్లైదుబాయ్ విమాన ఘటన.. క్యాబిన్ సిబ్బంది పాత్రపై అనుమానాలు!

**ఫ్లైదుబాయ్ విమానంలో భారత పైలట్ కెప్టెన్‌పై దాడి చేసిన ఒమన్ జాతీయుడైన కో-పైలట్ యత్నాన్ని భగ్నం చేసి, కో-పైలట్‌ను బంధించిన ప్రయాణికులు**

**దాడి చేసిన వ్యక్తిని విడిచిపెట్టాలని సిబ్బంది కోరడంతో ప్రయాణికుల్లో తీవ్ర అనుమానాలు**

**సిబ్బందిని నమ్మని ప్రయాణికులు.. పోలీసులకే అప్పగిస్తామని స్పష్టీకరణ**

**ప్రయాణికుల సమయస్ఫూర్తితో విమానం సురక్షితంగా ల్యాండింగ్**



దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఊహించని, భయానక ఘటన చోటుచేసుకుంది. విమానాన్ని కూల్చివేసే ఉద్దేశంతో కో-పైలట్, భారతీయ పైలట్‌పై గొడ్డలితో దాడికి పాల్పడగా, ప్రయాణికులు సాహసోపేతంగా ఆ యత్నాన్ని అడ్డుకున్నారు. అయితే, ఈ ఘటనలో విమాన సిబ్బంది ప్రవర్తన తీవ్ర అనుమానాలకు, కొత్త వివాదానికి దారితీసింది.

### అసలేం జరిగిందంటే..

ఫ్లైదుబాయ్‌కు చెందిన ఎఫ్ జెడ్ 1073 విమానం టెల్ అవీవ్‌కు బయలుదేరిన కొద్దిసేపటికే కాక్‌పిట్‌లో కలకలం రేగింది. ఒమన్‌కు చెందిన కో-పైలట్ హమామ్ అల్-హమామి, విమానాన్ని నడుపుతున్న భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై క్రాష్ యాక్స్ (విమానంలో ఉండే చిన్న గొడ్డలి)తో దాడికి తెగబడ్డాడు. విమానాన్ని కూల్చేయడమే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడినా, కెప్టెన్ స్మిత్ మచ్చర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి కాక్‌పిట్ డోర్ తెరిచి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆయన కేకలు విన్న ప్రయాణికులు వెంటనే స్పందించారు. వారిలో ఉన్న ఇద్దరు ఆఫ్-రోస్టర్ పైలట్లు, మరికొందరు ప్రయాణికులు కలిసి కో-పైలట్ హమామ్‌ను అడ్డుకున్నారు. అతడిని కిందికి పడేసి, ఇయర్‌ఫోన్ వైర్లతో చేతులు కట్టేసి పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ ఘటనలో పట్టుబడిన వారిలో టీవీ షో 'మేడే' చూసిన అనుభవంతో విమానాన్ని స్థిరంగా ఉంచడంలో సహాయపడిన ప్లంబర్ యానివ్ హయున్, గాయపడిన కెప్టెన్‌కు చికిత్స అందించిన దంత వైద్యుడు షోటా ముసేవ్ కూడా ఉన్నారు.

### సిబ్బంది పాత్రపై అనుమానాలు

దాడి చేసిన కో-పైలట్‌ను ప్రయాణికులు బంధించిన తర్వాత అసలు నాటకీయత మొదలైంది. 'ది న్యూయార్క్ పోస్ట్' కథనం ప్రకారం, ఫ్లైదుబాయ్ క్యాబిన్ సిబ్బంది ప్రయాణికుల వద్దకు వచ్చి, దాడికి పాల్పడిన హమామ్ అల్-హమామి కట్లు విప్పి అతడిని వదిలివేయమని కోరారు. సిబ్బంది చేసిన ఈ వింత అభ్యర్థనతో ప్రయాణికులు విస్తుపోయారు. వారిపై తీవ్ర అనుమానం పెంచుకున్న ప్రయాణికులు, అందుకు నిరాకరించారు. అతడిని పోలీసులకే అప్పగిస్తామని తేల్చిచెప్పారు. అంతేకాదు, సిబ్బందిని నమ్మని ప్రయాణికులు.. వారిని కాక్‌పిట్ సమీపంలో ఉండనీయకుండా విమానం మధ్య భాగంలో కూర్చోవాలని ఆదేశించారు. ఇది పరిస్థితి ఎంత ఉద్రిక్తంగా మారిందో తెలియజేస్తుంది. విచారణ కోసం కో-పైలట్ ప్రాణాలతో ఉండటం ముఖ్యమని భావించిన ప్రయాణికులు, అతడికి ఆక్సిజన్ మాస్క్ కూడా అందించారు. దాదాపు గంటా 40 నిమిషాల పాటు అతడిని తమ ఆధీనంలో ఉంచుకొని, విమానాన్ని సురక్షితంగా సమీపంలోని ఓ చిన్న విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. మొత్తం 174 మంది ప్రయాణికులు (27 మంది పిల్లలతో సహా) సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ హీరోయిజం, ప్రయాణికుల ధైర్యసాహసాలను అందరూ ప్రశంసిస్తున్నప్పటికీ.. దాడి చేసిన వ్యక్తిని విడిచిపెట్టమని సిబ్బంది ఎందుకు కోరారనేది ఆసక్తికరంగా మారింది. ఈ ఘటనపై దర్యాప్తులో సిబ్బంది పాత్రపై కూడా విచారణ జరిపే అవకాశం ఉంది.

## సంపాదకీయం

### ఉక్రెయిన్‌పై రష్యా దాడులు.. యుద్ధానికి బలవుతున్న సామాన్యులు

ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధం మరోసారి అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. యుద్ధ క్షేత్రాలకే పరిమితం కావాల్సిన దాడులు పారిశ్రామిక సంస్థలు, ఔషధ తయారీ కేంద్రాలు, పౌరుల నివాస ప్రాంతాలపైకి విస్తరిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఉక్రెయిన్‌లోని భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి చేయడం, ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం యుద్ధం సృష్టిస్తున్న విషాదానికి మరో నిదర్శనం. ఔషధాల తయారీ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ వంటి కీలకమైన రంగాల్లో పనిచేసే సంస్థలు కూడా యుద్ధ ప్రభావానికి గురవుతుండటం అంతర్జాతీయ మానవతా విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. యుద్ధం అంటే కేవలం రెండు దేశాల సైన్యాల మధ్య జరిగే పోరాటం మాత్రమే కాదు. దాని ప్రభావం సరిహద్దులను దాటి విస్తరిస్తుంది. ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటాయి. వాణిజ్య సంబంధాలు క్షీణిస్తాయి. సామాన్యుల జీవనోపాధి దెబ్బతింటుంది. ముఖ్యంగా వైద్య, ఆరోగ్య రంగాలపై యుద్ధ ప్రభావం పడితే దాని పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయి. ప్రాణాలను కాపాడాల్సిన ఔషధ పరిశ్రమలే దాడులకు గురైతే, యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనని ప్రజలు కూడా పరోక్షంగా ప్రాణసంకటాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

భారతీయ సంస్థపై జరిగిన దాడి కేవలం ఒక పారిశ్రామిక కేంద్రానికి జరిగిన నష్టం కాదు. అది అంతర్జాతీయ పెట్టుబడుల భద్రత, విదేశాల్లో పనిచేస్తున్న భారతీయ సంస్థల రక్షణ, పౌరుల ప్రాణాలకు సంబంధించిన కీలక అంశాలను తెరపైకి తెచ్చింది. యుద్ధం ఎంతకాలం కొనసాగితే అంతగా మానవ నష్టం పెరుగుతుందన్న వాస్తవాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాలి. దౌత్యపరమైన చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది. రష్యా, ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిణామాలను ప్రభావితం చేస్తోంది. సైనిక ఆధిపత్యం, భౌగోళిక రాజకీయ ప్రయోజనాలు, భద్రతాపరమైన ఆందోళనలు ఈ యుద్ధానికి ప్రధాన కారణాలుగా ఉన్నప్పటికీ, దాని మూల్యం మాత్రం సామాన్య ప్రజలే చెల్లిస్తున్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్‌లోని అనేక నగరాలు, పారిశ్రామిక ప్రాంతాలు, మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. విద్యుత్తు కేంద్రాలు, రవాణా వ్యవస్థలు, పరిశ్రమలు, నివాస ప్రాంతాలు దాడుల ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడు భారతీయ ఫార్మా సంస్థపై జరిగిన దాడి ఈ ప్రమాదం మరో రంగానికి విస్తరించిన విషయాన్ని తెలియజేస్తోంది.

పరిశ్రమలు ఏ దేశానికైనా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివి. ఉపాధి కల్పన, ఉత్పత్తి, ఎగుమతులు, ప్రభుత్వ ఆదాయం వంటి అనేక అంశాలు పారిశ్రామిక కార్యకలాపాలపై ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా ఔషధ పరిశ్రమ ప్రజారోగ్యానికి నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. ఒక ఫార్మా సంస్థలో ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల ఆ సంస్థకే కాకుండా, దాని సరఫరా వ్యవస్థపై ఆధారపడిన ఆసుపత్రులు, వైద్యులు, రోగులు, ఔషధ పంపిణీదారులపైనా ప్రభావం పడుతుంది. యుద్ధం కారణంగా ఇటువంటి సంస్థలు మూతపడటం లేదా వాటి కార్యకలాపాలు నిలిచిపోవడం ప్రజలకు అవసరమైన మందుల లభ్యతను దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఔషధాల తయారీకి నిరంతర విద్యుత్తు సరఫరా, సురక్షితమైన రవాణా, నాణ్యమైన ముడిసరుకులు, నిపుణులైన సిబ్బంది అవసరం. వీటిలో ఏ ఒక్క అంశానికి ఆటంకం ఏర్పడినా ఉత్పత్తి ప్రక్రియపై ప్రభావం పడుతుంది. దాడుల కారణంగా పరిశ్రమలు దెబ్బతింటే వాటిని తిరిగి ప్రారంభించడానికి భారీగా పెట్టుబడులు అవసరమవుతాయి. యంత్రాలను పునరుద్ధరించడం, భవనాలను మరమ్మతు చేయడం, ముడిసరుకులను సమకూర్చుకోవడం, ఉద్యోగుల భద్రతను నిర్ధారించడం వంటి చర్యలకు సమయం పడుతుంది. అప్పటివరకు ఉత్పత్తి తగ్గడం వల్ల మార్కెట్‌లో మందుల కొరత ఏర్పడే అవకాశముంది.

భారతీయ ఫార్మా సంస్థపై దాడి జరిగిన ఘటన ఈ నేపథ్యంలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ దాడి వెనుక ఉద్దేశాలు ఏమిటి? ఆ సంస్థను లక్ష్యంగా చేసుకున్నారా? లేక పారిశ్రామిక ప్రాంతంపై జరిగిన దాడిలో అది కూడా దెబ్బతిందా? అనే అంశాలపై సమగ్ర విచారణ అవసరం. దాడి జరిగిన ప్రదేశం, నష్టం, ప్రాణనష్టం, సంబంధిత పరిస్థితులపై నిష్పాక్షికమైన సమాచారం వెలువడాలి. యుద్ధ సమయంలో సమాచార యుద్ధం కూడా తీవ్రంగా సాగుతుంటుంది. అందువల్ల ధ్రువీకరించిన వాస్తవాల ఆధారంగానే అంతర్జాతీయ సమాజం స్పందించాలి. ఔషధ పరిశ్రమల ప్రధాన లక్ష్యం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం. అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు, అత్యవసర వైద్య పరిస్థితులు, శస్త్రచికిత్సలు ఇలా ప్రతి సందర్భంలోనూ మందుల అవసరం ఉంటుంది. యుద్ధం జరుగుతున్న ప్రాంతాల్లో ఈ అవసరం మరింత ఎక్కువగా ఉంటుంది. క్షతగాత్రులకు చికిత్స అందించడానికి, వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి, దీర్ఘకాలిక రోగులకు నిరంతర వైద్యం అందించడానికి ఔషధాలు అత్యవసరం. అటువంటి పరిస్థితుల్లో ఔషధాల తయారీ కేంద్రాలు, ఆసుపత్రులు, వైద్య సరఫరా వ్యవస్థల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి.

యుద్ధం కారణంగా ఆసుపత్రులపై దాడులు జరిగినప్పుడు గాయపడిన వారికి చికిత్స అందించడం కష్టమవుతుంది. వైద్య సిబ్బంది ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. వైద్య పరికరాలు, మందులు అందుబాటులో లేకపోతే అత్యవసర చికిత్సలు కూడా ఆలస్యమవుతాయి. ఈ పరిస్థితుల్లో ఔషధ తయారీ కేంద్రాలు కూడా దాడులకు గురైతే ఆరోగ్య వ్యవస్థపై ద్వంద్వ ప్రభావం పడుతుంది. ఒకవైపు యుద్ధంలో గాయపడిన వారికి వైద్య సహాయం అవసరమవుతుండగా, మరోవైపు మందుల ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలు దెబ్బతినడం వల్ల ఆ అవసరాలను తీర్చడం మరింత కష్టమవుతుంది. అంతర్జాతీయ మానవతా చట్టాలు పౌరుల రక్షణకు, పౌర మౌలిక సదుపాయాల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తాయి. పౌరులు, సైనిక లక్ష్యాల మధ్య తేడాను గుర్తించడం, దాడుల సమయంలో అనుపాత సూత్రాన్ని పాటించడం, పౌరులకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం యుద్ధంలో పాల్గొనే పక్షాల బాధ్యత. ఔషధ తయారీ కేంద్రం వంటి సంస్థపై దాడి జరిగినప్పుడు అది సైనిక లక్ష్యమా? పౌర వినియోగానికి సంబంధించినదా? దాడి వల్ల పౌరులకు కలిగే నష్టం ఎంత? వంటి అంశాలను పరిశీలించాలి. కేవలం ఒక సంస్థ దెబ్బతిన్నదనే కారణంతో దాడి చట్టవిరుద్ధమని తక్షణ నిర్ణయానికి రావడం సరైనది కాదు. అదే సమయంలో పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగించే దాడులపై నిష్పాక్షిక విచారణ జరగాల్సిందే.

యుద్ధం పేరుతో మానవతా విలువలను విస్మరించడం ఏ పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు. దేశాల మధ్య వివాదాలు ఉండవచ్చు. భద్రతాపరమైన సమస్యలు తలెత్తవచ్చు. భూభాగాలపై హక్కుల విషయంలో విభేదాలు ఉండవచ్చు. అయితే ఈ సమస్యలకు పరిష్కారం కనుగొనే క్రమంలో సాధారణ పౌరుల ప్రాణాలను పణంగా పెట్టడం తగదు. ముఖ్యంగా వైద్య, ఆరోగ్య రంగాలకు చెందిన సంస్థల విషయంలో అత్యంత అప్రమత్తత అవసరం. భారతదేశానికి చెందిన సంస్థలు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా ఔషధ పరిశ్రమలో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలను ఉత్పత్తి చేయడంలో భారతీయ కంపెనీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలకు కూడా భారతీయ ఔషధాలు సరఫరా అవుతున్నాయి. ఈ రంగంలో సాధించిన ప్రగతి భారతదేశానికి ఆర్థికంగా, వాణిజ్యపరంగా మాత్రమే కాకుండా, అంతర్జాతీయ ప్రజారోగ్య పరిరక్షణలోనూ ప్రాధాన్యాన్ని తీసుకొచ్చింది.

భారతీయ ఫార్మా కంపెనీలు దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాల్లోనూ ఉత్పత్తి కేంద్రాలు, పంపిణీ వ్యవస్థలు, పరిశోధనా విభాగాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. స్థానిక మార్కెట్లకు అనుగుణంగా ఔషధాలను అందుబాటులోకి తీసుకురావడం, ఉత్పత్తి వ్యయాలను తగ్గించడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం వంటి లక్ష్యాలతో ఈ విస్తరణ జరుగుతోంది. ఉక్రెయిన్‌లో భారతీయ సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం కూడా ఈ అంతర్జాతీయ విస్తరణలో భాగంగా చూడవచ్చు. అయితే యుద్ధం వంటి అసాధారణ పరిస్థితుల్లో విదేశాల్లో పెట్టుబడులు పెట్టిన సంస్థల భద్రత ఒక కీలక సవాలుగా మారుతోంది.



-గుర్రం పాపిరెడ్డి
ఎడిటర్

# మానుకోటలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు బంద్

### ప్రతి నెలలో పైప్ లైన్ ధ్వంసం పైప్ లైన్ లీకేజీలు తక్కువ నీటి సామర్థ్యం ఉన్నదంటూ రోజుల రోజులకొద్దీ ఇదే తంతు

### అంతరాయాలతో భగీరథ మంచి నీటి సరఫరా



అరుణప్రభ 4 అక్టోబర్ మహబూబాబాద్

కొత్త బజార్ ప్రజలకు మంచినీటి సరఫరా సాఫీగా సాగేందుకు కంకర బోర్డ్ కొత్త మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకును ఎప్పుడు వినియోగంలోకి తెస్తారు పూర్తి అయ్యేసరికి ఎంత కాలం పడుతుందిఇంకా అనేక వార్డుల్లో పూర్తికాని మిషన్ భగీరథ పైప్ లైన్ పనులుదశాబ్ద కాలం అవుతున్న మిషన్ భగీరథ పనులు ఇంకా సంపూర్ణంగా పూర్తి చేయరాప్రత్యామ్నాయ మున్నేరు వాగు ఏటిగడ్డ సంప్ హౌస్ ను వినియోగంలోకి తీసుకురావాల్సిందే మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి డిమాండ్మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయం ముందు సిపిఐ కౌన్సిలర్లు నిరసన ఆందోళన.........నేడు మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ మంచినీటి సరఫరా బందు చేశారని అక్టోబర్ 1 2 అని చెప్పి మళ్ళీ మరొక రెండు రోజులు సరఫరా చేయలేదని ప్రతినెల ఇదే తంతు నడుస్తున్నదని గత ఆగస్టు సెప్టెంబర్ నెలలో కూడా కొరివి సమీపంలో పైప్ లైన్లు పగిలినయని లీకేజీలు వస్తున్నాయని గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్నాయని ఇలా పలు రకాల కారణాలతో మంచినీటి సరఫరా లో తీవ్ర అంతరాయం కలుగుతుందని అందువల్ల నల్ల నీటిపై ఆధారపడిన ప్రజలు తీవ్రంగా వారు ఇబ్బంది పడుతున్నారని అంతేకాకుండా మున్నేరు బాబు ద్వారా మంచినీటి సరఫరా ఏ విధంగా గతంలో జరిగిందో అదేవిధంగా మిషన్ భగీరథ కూడా రోజు తప్పించి రోజు ఇస్తున్నారని ప్రతిరోజు ఇవ్వడం లేదని పైగా ప్రతి నెలలో ఇదే పద్ధతిలో అదనంగా నాలుగైదు రోజులు మంచినీటి సరఫరా వరుసగా అవాంతరాలు కలుగుతున్నాయని దానికి మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు మున్సిపల్ కమిషనర్ సమాచార ప్రకటనలే అందుకు సాక్ష్యం అని సిపిఐ మున్సిపల్ లో లీడర్ 33 వ వార్డు కౌన్సిలర్ బి అజయ్ సారథి రెడ్డి అన్నారు ఇంకా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో మిషన్ భగీరథ పైప్ లైన్ లో పనులు సంపూర్ణంగా పూర్తి కాలేదని కొన్ని చోట్ల ఇప్పుడే ప్రారంభమయ్యా అని అంతేకాకుండా శివారు కాలనీలో వార్డులలో పైప్ లైన్లు వేసిన నీటి సరఫరా సక్రమంగా అవసరమైనంత చేయడం లేదని అన్నారు ముఖ్యంగా 25 వ వార్డు ధర్మన్న కాలనీలో పైప్లైన్ లేసిన వీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని అన్నారు ముఖ్యంగా కొత్త బజారు మొత్తం మంచినీటి సరఫరా మెరుగుగా జరగాలంటే కంకర బోర్డ్ గుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ ఓరి ట్యాంకును తక్షణమే పూర్తి చేసి కనెక్షన్ ఇచ్చి కొత్త బజారుకు ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా మంచినీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా మిషన్ భగీరథలో వివిధ సందర్భాల్లో నీటి సామర్థ్యం అవసరమైనంత లేని సందర్భాల్లో సరఫరా కూడా సక్రమంగా జరగడం లేదని అన్నారు మహబూబాబాద్ లోని మున్నేరు వాగు ఏటిగడ్డ తండా వద్ద ఉన్న 1960లో నిర్మించిన సంపోజిట్ను నిరుపేయంగా ఉంచకుండా ప్రత్యామ్నాయ వినియోగ అవకాశంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు సుమారు పది సంవత్సరాలుగా అనగా దశాబ్దం పాటు మిషన్ భగీరథ పనులు పున సాగుతూనే ఉన్నాయని సంపూర్ణంగా ఎప్పుడు పూర్తి అవుతాయని మొత్తంగా మిషన్ భగీరథ పైన స్పష్టమైన సమగ్ర సమాచారంతో కూడిన శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు ఈ నిరసన ఆందోళనలో సిపిఐ 18 వ వార్డు కౌన్సిలర్ దేశపల్లి నవీన్ సిపిఐ 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్ సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 33 వ వార్డు కౌన్సిలర్ రెడ్డి ఇల్లు కలిసి ముగ్గురు నిరసన ఆందోళన చేయగా సిపిఐ నేతలు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ పట్టణ సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు నర్రా శ్రావణ్ వెలుగు శ్రావణ్ నాయకులు మంద శంకర్ రాగం మల్లయ్య నీలం వెంకటేశ్వర్లు గాదం శ్యాంప్రసాద్ బోళ్ల భద్రయ్య షరీఫ్ గుండోజు రమేష్ తదితరులు పాల్గొన్నారు

# ఇంజాపూర్ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

### విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



తొర్రూర్: అరుణ ప్రభ. అక్టోబర్ 4.ఇంజాపూర్ మండల ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇంజాపూర్ ప్రాథమిక పాఠశాల పీఎం శ్రీ పథకం కింద ఎంపిక కావడంతో భవన నిర్మాణానికి రూ. 54 లక్షలు మంజూరయ్యాయి. అయితే పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో గత మూడేళ్లుగా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఈ సమస్యను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు సీసీఎల్ఏ కమిషనర్ 21 గుంటల భూమిని ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి కేటాయిస్తూ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీంతో పాఠశాల నూతన భవన నిర్మాణానికి మార్గం సుగమమైంది. పీఎం శ్రీ పథకం కింద రంగారెడ్డి జిల్లాలో కేవలం మణికొండ, ఇంజాపూర్ పాఠశాలలు మాత్రమే ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. పథకంలో భాగంగా పాఠశాలలో నాలుగు గదుల నిర్మాణం చేపట్టనున్నారు. అదనంగా పాఠశాల ప్రహరీ, మరిన్ని గదులు, మూత్రశాలల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను ఆదేశించి అవసరమైన నిధులు కేటాయించేలా చూస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

**తొర్రూర్ వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు**

అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి +నవీజ తొర్రూర్ వార్డు పరిధిలోని తిరుమల నగర్, బాలాజీ నగర్ కాలనీ, ఆపిల్ కాలనీ, సాయినాథ్ కాలనీ, శ్రీరంగపురం, పోచమ్మ బస్తీలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కాలనీలలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వీజూా జగదీష్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, రూాజ చైర్మన్ సంరెడ్డి ధనలక్ష్మి, జుఔ×ణజ ణజుజు వెంకటేష్, సాంకేత్, డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, ణజు బిక్షపతి, ూజు చంద్రశేఖర్ రెడ్డి, ఎవీఔా మేనేజర్ మొహమ్మద్ అసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తొర్రూర్ వార్డు అధ్యక్షులు కోశిక ఐలయ్య, కొత్త కుర్మ సత్తయ్య, మాజీ వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, బొక్క వంశీధర్ రెడ్డి, సూర్యనగర్ కాలనీ అధ్యక్షులు యాదగిరి, ఆపిల్ కాలనీ అధ్యక్షులు నాయిని చెన్నారెడ్డి, తిరుమలనగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెల బాల్రాజ్, గౌస్ పాషా, ప్రభాకర్ రెడ్డి, రమణ, ఆంజనేయులు, నరేష్, సైదులు, నరేందర్ రెడ్డి, వినోద్, భాస్కర్, పాండు, ధశ్రు తదితరులు పాల్గొన్నారు.

# వైజాగ్ కామిక్ కాన్ తొలి ఎడిషన్‌కు టోన్ సెట్ చేసిన కాస్‌ప్లే మాస్టర్ క్లాస్





విశాఖపట్నం, అక్టోబర్ 04, 2026: కామిక్ కాన్ ఇండియా విశాఖపట్నంలోని సాగర్ నగర్‌లో ఉన్న పాఫ్ కేఫ్(ఝుఝటటవ ఝుటవ)లో నగరపు మొట్టమొదటి ప్రత్యేక కాస్‌ప్లే మాస్టర్‌క్లాస్‌ను నిర్వహించింది. ఇండియన్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ కాస్‌ప్లే(×జజ) 2026 గ్రాండ్ ఛాంపియన్ అరిందం పాల్, అలాగే హైదరాబాద్ కామిక్ కాన్ కాస్‌ప్లే పోటీ 2025 విజేత అయిన కాస్ ప్లేయర్ డి. కిరణ్ రాజ్ ఈ సెషన్‌కు నాయకత్వం వహించారు. స్థానిక అభిమానులకు భారతదేశంలోని అనుభవజ్ఞులైన కాస్‌ప్లేయర్ల నుండి నేరుగా నేర్చుకునే అవకాశాన్ని ఈ సెషన్ కల్పించింది. అలాగే విశాఖపట్నంలో అభివృద్ధి చెందుతున్న కాస్‌ప్లే కమ్యూనిటీ ఒకచోట చేరడానికి, కొత్త విషయాలు తెలుసుకోవడానికి మరియు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఇది ఒక వేదికను అందించింది. ఈ సెషన్‌కు నాయకత్వం వహించిన అరిందం పాల్(ూతీఱఅఝుఎ ూఝుబశ్రీ) మాట్లాడుతూ, "ఈ కాస్‌ప్లే మాస్టర్ క్లాస్‌ను నిర్వహించడం నాకు అద్భుతమైన అనుభూతినిచ్చింది. ప్రేక్షకులతో జరిగిన ఇంటరాక్టివ్ సెషన్ నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. పాల్గొన్న వారి ఉత్సాహాన్ని చూడటం, ఆశావహ కాస్‌ప్లేయర్లతో నా అనుభవాలను పంచుకోవడం ఈ సెషన్‌ను ఎంతో సంతృప్తికరంగా మార్చింది. ఐసీసీ(×జజ) విజేతగా నిలవడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఆ అనుభవాన్ని ఉపయోగించుకుంటూ ఇతర కాస్‌ప్లేయర్లకు స్ఫూర్తినివ్వడం మరియు వారితో కనెక్ట్ కావడం చాలా సంతోషంగా ఉంది. రాబోయే నగరాల్లో కూడా ఇలాంటి మరిన్ని సెషన్లలో భాగం కావడానికి నేను ఎంతగానో ఎదురుచూస్తున్నాను" అని అన్నారు. కాస్ట్యూమ్ క్రియేషన్ మరియు క్యారెక్టర్ ట్రాన్స్‌ఫర్మేషన్‌పై ప్రాక్టికల్ అవగాహన కల్పించడానికి ఈ సెషన్ అనుభవజ్ఞులను, ఆసక్తిగల కాస్‌ప్లేయర్లను ఒకచోట చేర్చింది. మెటీరియల్స్ మరియు టూల్స్‌ను ఎంచుకోవడం, టెంప్లేట్లను సేకరించడం, కాస్ట్యూమ్స్‌ను తయారు చేయడం నుండి ప్రొఫెషనల్ లుక్‌ను సాధించడం వరకు కాస్‌ప్లే రూపకల్పన వెనుక ఉన్న మెళకువలను ఈ మాస్టర్‌క్లాస్ ద్వారా పాల్గొనేవారికి వివరించారు. డి. కిరణ్ రాజ్ మాట్లాడుతూ, "అరిందం పాల్‌తో కలిసి ఈ మాస్టర్‌క్లాస్ నిర్వహించడం అద్భుతమైన అనుభూతినిచ్చింది. కాస్‌ప్లే బేసిక్స్, ప్రాప్స్ తయారీ టెక్నిక్స్ నుండి టెంప్లేట్లు మరియు టూల్స్ వరకు అన్నింటినీ మేము చర్చించాము. ఆ తర్వాత 'హెల్మ్ ఆఫ్ సొలిట్యూడ్ ఆర్మర్ హెల్మెట్'కు సంబంధించి లైవ్ డెమో కూడా చూపించాము. ఈ హ్యాండ్-ఆన్ సెషన్ మరియు ఆడియెన్స్ నుండి వచ్చిన ఉత్సాహభరితమైన ప్రశ్నలు దీన్ని ఎంతో ఇంటరాక్టివ్‌గా, సరదాగా మార్చాయి. కాస్‌ప్లే గురించి మరింత తెలుసుకోవడానికి ఇంత మంది ఉత్సాహం చూపడం చాలా సంతోషంగా ఉంది!" అని అన్నారు. ఫోమ్ షేపింగ్, ఆర్మర్ కన్‌స్ట్రక్షన్, సర్ఫేస్ డీటెయిలింగ్, మెటాలిక్ ఫినిషెస్, ప్రాప్ వెదరింగ్ వంటి టెక్నిక్స్‌తో పాటు.. క్యారెక్టర్లకు మరింత రియాల్టీని తీసుకురావడానికి హైలైట్స్ మరియు షాడోలను ఎలా ఉపయోగించాలనే అంశాలను ఈ సెషన్‌లో వివరించారు. కేవలం కాస్ట్యూమ్స్ తయారీకే పరిమితం కాకుండా, వీఎఫ్ఎక్స్ మేకప్ (ఎఖీశ ఝుఎవబజూ), విగ్ స్టైలింగ్ మరియు మెటీరియల్స్‌ను సేకరించి తిరిగి ఉపయోగించే సృజనాత్మక మార్గాలపై కూడా ఈ మాస్టర్‌క్లాస్‌లో డెమోలు చూపించారు. పాల్గొనేవారు తమకు ఇష్టమైన క్యారెక్టర్‌కు ప్రాణం పోయడంలో ఎంత నైపుణ్యం, సృజనాత్మకత మరియు శ్రద్ధ ఉంటుందో స్వయంగా తెలుసుకోవడానికి ఈ హ్యాండ్-ఆన్ ఫార్మాట్ ఎంతో దోహ దపడింది. క్రంచీరోల్(Crunchyroll) సౌజన్యంతో మారుతి సుజుకి సమర్పిస్తున్న విశాఖపట్నం కామిక్‌కాన్ అక్టోబర్ 10-11 తేదీలలో కలాం కన్వెన్షన్ సెంటర్‌లో అరంగేట్రం చేయడానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో జరిగిన ఈ మాస్టర్‌క్లాస్, నగరంలో కామిక్‌కాన్ ప్రయాణానికి ఒక అద్భుతమైన ఆరంభాన్ని అందించింది. ఈవెంట్ వివరాలు:ఈవెంట్ పేరు: కాస్‌ప్లే మాస్టర్ క్లాస్‌వేదిక: పాఫ్ పెట్ ఫ్రెండ్లీ రెస్టో కేఫ్(Pawffe Pet Friendly Resto Cafe), బీచ్ రోడ్, గుడ్ల వాని పాలెం, సాగర్ నగర్, విశాఖపట్నంతేదీ: అక్టోబర్ 3, 2026, శనివారంప్రవేశం: ఉచితం

# మౌనిక మృతికి సంతాపం.. శంకర్ కుటుంబానికి అండగా టీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, అక్టోబర్ 04:ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ముక్క శంకర్ భార్య మౌనిక అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న టీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. మౌనిక భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించి, జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ముక్క శంకర్‌ను పరామర్శించిన నాయకులు ఆయనకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో శంకర్ కుటుంబానికి దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సిటీ లక్ష్మణరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుల్లపల్లి నరసింహారెడ్డి, దుమాల మాజీ ఎంపీటీసీ కమ్మర్ శంకర్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎమ్మార్పీఎస్ నాయకులు కానాపురం లక్ష్మణ్ మాదిగ, గద్దరాసి భగవంతన్న మాదిగ, బి. రాజేష్ మాదిగ, ముక్క దేవయ్య మాదిగ, ముక్క శ్రీనివాస్ మాదిగ, దరువు రమేష్ మాదిగ, సాగర్ మాదిగ, సతీష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# ఓ యువతా! మాట కాదు మార్గం చూడు!!






"గొప్ప పనులు మాటలతోకాదు' నిశ్శబ్దంగా చేసేచేతలతోనే సాధించబడతాయి" బిమహాత్మాగాంధీ.కేవలం మాటలు చెప్పడం సులువు కానీ ఆ మాటలను చేతుల్లో చూపించినప్పుడే మనిషికి నిజమైన గుర్తింపు గొప్పతనం లభిస్తాయి. సమాజంలో శాశ్వతంగా నిలిచిపోయేది మన పనులుకానీ మనం పలికే ఉత్తమ పదాలు కావు. మాటలు కోటలు దాటుతాయికానీ అడుగులు గడపైనా దాటవు పలికే పదాలు అందంగా ఉండొచ్చు కాని చేసే పనులే చరిత్రను మారుస్తాయి చిలుక పలుకులు ఎన్నైనా చెప్పొచ్చు కానీ గమ్యం చేరేది రెక్కల కష్టంతోనే ఆకాశాన్ని చూపిస్తూ మురిపించడం కాదు నేలపై నిలబడి గెలవడమే నిజమైన గమ్యం భాషణలు చేయడం చాలా సులువుఆచరణ పెట్టడమే అసలైన గెలుపు శబ్దాల వేగం కంటే శ్రమించే చేతుల వేగమే మిన్న కలలు కనడం మొదటి అడుగైతె కష్టపడడమే గమ్యానికి రహదారికాలం ఎవరికోసం ఆగదు సోదరా మాటలు ఆపి నీ పనిని మొదలు పెట్టు ప్రగల్భాలు కాదు ఫలితాలు ముఖ్యం ఫలితాలే నీప్రఖ్యాతిచేసే ప్రతి పనిలో శ్రద్ధ ఉంటే విజయం నీ నీడలా మారుతుంది నీ మాటలు నిన్ను గొప్పవాడినిచేయవునీచేతలే సమాజంలో నీకు గౌరవం తెస్తాయిమాటల వెనుక దాక్కోకు సోదరా?చేతలతో నీ సత్తా చాటుకో ప్రపంచం నీ మాటలుమర్చిపోవచ్చు కానీ నువ్వు సృష్టించిన అద్భుతాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది నువ్వు ప్రపంచాన్ని మార్చాలనుకుంటే మొదటఆ మార్పును నీచేతల్లో చూపించు బిస్వామి వివేకానంద. మాటల ఆర్భాటం తాత్కాలికం.కానీ చేతల ప్రభావం శాశ్వతం. విమర్శలుపొగడ్తలతో పని లేకుండా నిశ్శబ్దంగా మన పనినీ మనం చేసుకుంటూ పోయినప్పుడే విజయం మనల్ని వెతుకుతూ వస్తుంది .మాటలు తగ్గించి చేతలుపెంచడమే యువత ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఏకైక మార్గం.నేదునూరి కనకయ్య

**- అధ్యక్షులు తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం,**
**రచయిత కాలమిస్ట్, కరీంనగర్9440245771**

# వన్యప్రాణుల పరిరక్షణతో పర్యావరణ సమతుల్యత

### (02 - 08 అక్టోబర్ "జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు" సందర్భంగా)

పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వన్యప్రాణుల సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించుకుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరాసులను పరిరక్షించుకోనిఎడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి.

**భావితరాల మనుగడకు జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యత:**

మన పిల్లలకు అపార సంపదలను సంపాదించి పెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పోల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న వన్యప్రాణుల పరిరక్షణ అవసరాలను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి ప్రతి ఏట 02 -08 అక్టోబర్ "జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు" లేదా నేషనల్ వైల్డ్‌లైఫ్ వీక్" నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాంతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి.

**జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు-2026:**

నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుపులతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేవదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. భారతీయ "డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యూజియమ్స్ అండ్ జూస్" అనే సంస్థ జాతీయ స్థాయిలో వన్యప్రాణుల పరిరక్షణ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. భారత ప్రజలు, భూగోళం పరిరక్షణకు పెట్టుబడులు పెట్టడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. దేశ జనాభా ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించాలని కోరడం జరుగుతున్నది. 2026 జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు-2026 ఇతివృత్తంగా "ఆవాసాలను అనుసంధానించడం ద్వారా వన్యప్రాణులను సంరక్షించడం" అనబడే అంశాన్ని తీసుకున్నారు.

**జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో చేయదగిన కార్యక్రమాలు:**

జాతీయ వన్యప్రాణి వారోత్సవాల వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటి వి నిర్వహిస్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యతకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్-లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్యతకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరులూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపాడుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి. జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిద్దుకుందాం.

**మధుపాళీ, 9949700037**

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY



# నారాయణఖేడ్ ఇన్చార్జి ఏ డి ఏ గా ప్రవీణ్ చారి బాధ్యతలు స్వీకరణ



నారాయణఖేడ్ అరుణ ప్రభ న్యూస్: నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయ సహ సంచాలకులుగా నా గలిగిద్ద మండల్ వ్యవసాయ అధికారి ప్రవీణ్ చారి బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సూచనలు సలహాలు అందిస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని నారాయణఖేడ్ డివిజన్ రైతులకు ఇలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తానని ఆయన అన్నారు ఈ సందర్భంగా నారాయణఖేడ్ డివిజన్ కు సంబంధించిన ఏవోలు . ఏ ఈ ఓ లు.నూతన ఏ డి ఏ ప్రవీణ్ గారికి ఘనంగా సన్మానించడం జరిగింది.



## తెలంగాణ రక్షణ సేనలో భారీగా యువత చేరిక

### బొప్పాపూర్‌లో 50 మంది యువకులు, మహిళలు పార్టీలో చేరిక

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, అక్టోబర్ 04 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో ఆదివారం తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి భారీగా యువకులు, మహిళలు చేరారు. నియోజకవర్గ యువజన నాయకుడు సయ్యద్ జావిద్, మండల నాయకుడు బొమ్మనవేని పరశురాములు ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువకులు, మహిళలు పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా టీఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మజీద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు కవితక్క ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తూ వాటి పరిష్కారం కోసం కవితక్క చేస్తున్న పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత పార్టీలో చేరడం అభినందనీయమన్నారు.కవితక్క ముఖ్యమంత్రి అయితే తెలంగాణలో ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి--ఉద్యోగ అవకాశాల కల్పన, రైతు సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తారని మజీద్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు, రైతులు, మహిళలు, యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కవితక్క ఆదేశాల మేరకు పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జి కదిరే రేణుక, బొమ్మనవేని పద్మ, ఎల్లారెడ్డిపేట--ముస్తాబాద్ మండల ఇన్‌చార్జులు కదిరే భాస్కర్, మార్వాడి దేవరాజు, సీనియర్ నాయకులు ఆల్లె శంకర్, బందెల రాజు, చరణ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్య పరిష్కారానికి కృషి

### మల్లికార్జున నగర్‌లో డ్రైనేజీ పనులు పూర్తి.. కాలనీవాసుల హర్షం

పెద్ద అంబర్‌పేట్ అక్టోబర్ 4 (అరుణ ప్రభ) ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని నిరూపించేలా మల్లికార్జున నగర్ కాలనీలో 14 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని ఈ కాలనీలో డ్రైనేజీ సౌకర్యం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిద్ధెంకి కృష్ణారెడ్డి చొరవ తీసుకుని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరై డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ అభివృద్ధి పనులకు సహకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సిద్ధెంకి కృష్ణారెడ్డికి కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డ్రైనేజీ సౌకర్యం అందుబాటులోకి రావడంతో మురుగునీటి సమస్య, దోమల బెడద తగ్గి కాలనీలో పారిశుద్ధ్యం మెరుగుపడుతుందని వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాతాల వెంకటరెడ్డి, కోటా శ్రీనివాసరెడ్డి, యాదగిరి, స్వామి, ఉమేష్ రెడ్డి, మారం వెంకట్ రెడ్డి తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.



## దేశ రాజకీయాలు - పెరుగుతున్న మత భావనలు ::: కామ్రేడ్ అనిల్

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): దేశ రాజకీయాలలో పెరుగుతున్న మత భావనలు అనే అంశంపై కామ్రేడ్..అనిల్ ఉపన్యసించడం జరిగింది. ఆదివారం ఉదయం గూడూరు స్థానిక సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో జరిగిన మొదటి రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యదర్శి జోగి.శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో కామ్రేడ్. అనిల్ మాట్లాడుతూ దేశ ప్రజలు రోజు వారి జీవన సమస్యల మీద ఐక్యమై పోరాడాలని, దేశ రాజకీయాలను జీవన సమస్యల పరిష్కార దిశగా నడపాల్సిన బాధ్యత దేశ ప్రజల మీద బాధ్యత ఉందన్నారు, ప్రపంచంలో ఏ మత దేశంలో కూడా ఆర్థిక,సామాజిక, సమానత్వం లేదని,భారత దేశంలో కూడా ఆర్థిక,సామాజిక,సమానత్వాన్ని, ఏ మతం పరిష్కరించ లేదని, కేవలం సోషలిజం విధానాల...ద్వారానే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం,సి.ఐ.టి.యు,కెవిపిఎస్,ఆటో,ప్రజాసంఘాల నాయకులు టి.వెంకట్రామిరెడ్డి, బి.వి.రమణయ్య,పామంజి మణి,గుర్రం రమణయ్య, ఆర్.శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, ఎంబేటి.చంద్రయ్య, బొడ్డు.శ్రీనివాసులు, గార.బాబు, బి.ఎస్.ప్రభావతి, ఏ.ఇందిరమ్మ, జె.లక్ష్మీ,ఎం.అరుణ, సుధా, బి.నారాయణ, బి.భాస్కర్ రెడ్డి, ఏం.వెంకట్రావు, కె.డేవిడ్,ఆర్.నారాయణ,ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సారపాకలో ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా మెగా మెడికల్ క్యాంప్





పాలకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారి వైద్య శిబిరం.. సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్

సారపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక మసీదు రోడ్డులోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర--సారపాక ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. సారపాక మేజర్ గ్రామపంచాయతీలో పాలకవర్గం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.ఈ కార్యక్రమానికి ఐటీసీ పీఎస్పీడీ యూనిట్ హెడ్ సైలేందర్ కుమార్ సింగ్, శ్యాం కిరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సారపాక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, ఉపసర్పంచ్ కన్నెదారి రమేష్, రోటరీ క్లబ్ అధ్యక్షులు సింగ్, కార్యదర్శి డేవిడ్, పాకాల దుర్గాప్రసాద్, పలువురు ఐటీసీ పీఎస్పీడీ కాంట్రాక్టర్లు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ.. పాలకవర్గం ఏర్పడిన తర్వాత సారపాకలో తొలిసారిగా మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు తెలియజేసి ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి వైద్యం పొందడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు.ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని పేద ప్రజలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని సర్పంచ్ తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని మెడికల్ క్యాంపులు నిర్వహించడంతో పాటు రక్త పరీక్షలు కూడా చేపట్టేలా రోటరీ క్లబ్ సభ్యులు చొరవ తీసుకోవాలని కోరారు.సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేలా అవసరమైన సహకారం అందించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించిన రోటరీ క్లబ్ సభ్యులు ఐటీసీ యాజమాన్యం, కాంట్రాక్టర్లకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిసి పిఎస్పిడి టిఎన్టియుసి అధ్యక్షులు కనకమెడల హరిప్రసాద్, చెంగల్ రావు, పాకాల పాటి చందు, బసప్ప రమేష్, పోట్రు ఏసుబాబు, పాలకవర్గ సభ్యులు తిరుపతి చంటి, బాలి కనకారత్నం, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## బీసీ మహా గర్జనకు పెద్దగోల్కొండ నుంచి భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

### నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో 200 మంది తరలింపు



అరుణ ప్రభ శంషాబాద్ జోన్ : 4 ఆగస్టు శంషాబాద్: బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా, హక్కులు కల్పించాలనే డిమాండ్‌తో శంషాబాద్ మండలం గొల్లపల్లి రోడ్డులో నిర్వహించిన ఓబీసీ మహా గర్జన భారీ బహిరంగ సభకు పెద్దగోల్కొండ గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఆదేశాల మేరకు నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగౌని శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది పెద్దగోల్కొండ నుంచి సభకు తరలివెళ్లారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా, హక్కులు కల్పించాలనే డిమాండ్‌ను బలంగా వినిపించేందుకు ఓబీసీ మహా గర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీల ఐక్యత, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.బీసీల హక్కుల సాధన కోసం చేపట్టే ఉద్యమాలు, కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని శ్రీకాంత్ గౌడ్ కోరారు. బీసీల ఐక్యతను చాటిచెప్పేలా భారీ సంఖ్యలో ప్రజలు సభకు తరలిరావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కే. దేవేందర్, రాజశేఖర్ రెడ్డి, బిక్షపతి, మహానిధులు తదితరులు పాల్గొన్నారు.

# 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సత్తా చాటిన ఏ.ఆర్. డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్‌ప్రతాప్

### టెన్నిస్ పోటీల్లో ఒక బంగారు, రెండు రజత పతకాలు





అరుణప్రభ మహబూబాబాద్, అక్టోబర్ 4 : తెలంగాణ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో టెన్నిస్ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏ.ఆర్. డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్ ప్రతాప్ ప్రతిభ కనబరిచి ఒక బంగారు, రెండు రజత పతకాలు సాధించారు.సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో టెన్నిస్ విభాగంలో డబుల్స్‌లో బంగారు పతకం, ఓపెన్ సింగిల్స్‌లో రజత పతకం, ఓపెన్ డబుల్స్‌లో రజత పతకం సాధించారు.ఈ సందర్భంగా పతకాలు సాధించిన ఏ.ఆర్. డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్ ప్రతాప్ శనివారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పతకాలను పరిశీలించి, డీఎస్పీలను అభినందించారు. పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచి మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖకు గౌరవం తీసుకురావడం అభినందనీయమని ఎస్పీ డా. శబరీష్ పేర్కొన్నారు.పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు శారీరక దారుఢ్యం, క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల్లో మరింతగా రాణిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని డీఎస్పీలను ఎస్పీ ప్రోత్సహించారు.

## బీసీ మహా గర్జనకు భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తీగల శివకుమార్ ముదిరాజ్, భోలేనాథ్ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో 150 మంది తరలింపు



అరుణ ప్రభ – శంషాబాద్ జోన్ : ఆగస్టు 4శంషాబాద్: జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని హుడా కాలనీ నుంచి బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా, హక్కులు కల్పించాలనే డిమాండ్‌తో శంషాబాద్‌లో నిర్వహించిన ఓబీసీ మహా గర్జన భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తీగల శివకుమార్ ముదిరాజ్, భోలేనాథ్ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది హుడా కాలనీ నుంచి సభకు తరలివెళ్లారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా, హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల ఐక్యత, సామాజిక న్యాయం సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.బీసీల హక్కుల కోసం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హుడా కాలనీకి చెందిన కాలనీవాసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి గారిని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఈరోజు రైకోడ్ మండలం అధ్యక్షులు కేతార్నాథ్ పటేల్ నియమితులైన సందర్భంగా డీసీసీ అధ్యక్షులు నారాయణఖేడ్ పట్టణంలో వారి న్ వ్ గ్ ృ ప్ ా ం లో మర్యాదపూర్వకశీగా శాలువా కప్పి బొకే ఇస్తూ మండలం అధ్యక్షులు ఎన్నికకు న వా క రి ం చి న ం ద ు క ు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైకోడ్ వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి.రైకోడ్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నర్సింలు.మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వినయ్. నాయకులు శ్రీనివాస్. నజీర్. మహంకాళి. విట్టల్.సంగమేశ్ పాటిల్.విట్టల్ శివకుమార్.రైకోడ్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డికి మెదక్ జిల్లా రేగోడు మండలానికి చెందిన కాంట్రాక్టర్ నరేందర్ రేగోడు గ్రామ సర్పంచ్ చోటు మియా మండలం నాయకులు ఫాసిల్ శుభాకాంక్షలు తెలిపారు. నారాయణఖేడ్ పట్టణానికి చెందిన వెంకట్ గౌడ్ ఘనంగా సన్మానించడం జరిగింది.

### పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు.

జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా తెలియజేశారు .

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
సోమవారం, అక్టోబరు 5, 2026

# ఇబ్రహీంపట్నం జోనల్ లెవెల్ ప్రైవేట్ ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేసిన మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి

### ప్రైవేటు ఉపాధ్యాయులందరికి హెల్త్ కార్డులు వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతా : ఆదిభట్ల మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి

### విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రైవేటు ఉపాధ్యాయులది కీలకపాత్ర ఎంఈఓ హీర్య నాయక్



అరుణప్రభ ప్రతినిధి ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం జోనల్ స్థాయి ప్రైవేట్ ఉత్తమ ఉపాధ్యాయ ఆత్మీయ పురస్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 30 ఏళ్లుగా ప్రైవేటు ఉపాధ్యాయులుగా సేవలందించిన ప్రతి ఒక్కరికి అవార్డు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి ప్రైవేట్ ఉత్తమ ఉపాధ్యాయులకు షీల్డ్ సర్టిఫికెట్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు తల్లిదండ్రుల తర్వాత గురువులదే ప్రధాన పాత్ర నిత్యం విద్యార్థులను క్రమశిక్షణతో నడుపుతూ, భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల తగ్గట్టుగా వాళ్ళ బోధన ఉండాలని కోరారు. విద్యార్థి దశలోనే చాలామంది డ్రగ్స్ కి గంజాయి ఆన్లైన్ బెట్టింగ్ కి అలవాటు అవుతున్నారు వాళ్ళని సక్రమంగా నడిపే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని ఈ కార్యక్రమంలో భాగస్వాములు అయినందుకు సంతోషంగా ఉంది అని ఈ సందర్భంగా తెలిపారు.ఆదిభట్ల మాజీ మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ నేను మొదటగా ప్రైవేట్ టీచర్ గా విద్యార్థులకు బోధించడం జరిగింది సమాజంలో వాళ్ల శ్రమ వెలకట్టలేనిది ప్రైవేటు ఉపాధ్యాయులు అందరికీ హెల్త్ కార్డులు వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అది కాని పక్షాన సొంతంగా హెల్త్ ఇన్సూరెన్స్ చేయించడానికి ముందుంటాను అని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చే సంవత్సరం 500 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డు కార్యక్రమం జరపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హీర్య నాయక్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ముత్యాల శ్యామల భాస్కర్, ఆదిభట్ల మాజీ కౌన్సిలర్ పొట్టి రాములు, ఇబ్రహీంపట్నం కౌన్సిలర్ నీలం శ్వేతా బాలు విద్యార్థి నాయకులు నీట్టు జగదీష్ చేతుల మీదుగా , ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బొప్పాపూర్ ఏఎంసీపై కాంగ్రెస్ శ్రేణుల గర్జన!

### మార్కెట్ యార్డు మా ఊరిలో.. చైర్మన్ గిరీ కూడా మాకే!

### స్థానికుడిని కాదని ఇతర గ్రామానికి ఇస్తే.. మూకుమ్మడి రాజీనామాలు.



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, అక్టోబర్ 03:ఏరాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవిపై స్థానిక కాంగ్రెస్ శ్రేణులు గళమెత్తాయి. మార్కెట్ యార్డు ఉన్న బొప్పాపూర్ గ్రామానికే ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేస్తున్న స్థానిక నాయకులకు ఈసారైనా అవకాశం కల్పించాలని కోరారు.ఏఎంసీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో కొత్త చైర్మన్ నియామకానికి కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో బొప్పాపూర్ కాంగ్రెస్ శ్రేణులు తమ డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చాయి. మార్కెట్ కమిటీ ఏర్పడినప్పటి నుంచి ఇతర గ్రామాలకు చెందిన వారికి చైర్మన్ పదవులు దక్కుతున్నాయని, మార్కెట్ యార్డు ఉన్న బొప్పాపూర్‌కు మాత్రం చైర్మన్ పదవి దక్కకపోవడం పట్ల స్థానికుల్లో అసంతృప్తి ఉందని నాయకులు తెలిపారు.ప్రస్తుతం ఏఎంసీ చైర్మన్ పదవికి జనరల్ రిజర్వేషన్ రావడంతో.. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ, పదవులు ఆశించకుండా కష్టపడుతున్న బొప్పాపూర్ స్థానిక కాంగ్రెస్ నాయకుల్లో ఒకరికి అవకాశం కల్పించాలని కోరారు."మార్కెట్ యార్డు మా ఊరిలో ఉంది.. చైర్మన్ పదవి మాత్రం ఇతర గ్రామానికి ఎందుకు?" అంటూ స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. పార్టీ కోసం పనిచేసిన స్థానిక కార్యకర్తలను పక్కనపెట్టి ఇతర గ్రామాలకు చెందిన వారికి పదవి కట్టబెట్టే ప్రయత్నం చేయొద్దని కోరారు.

**పదవి వేరే ఊరికి ఇస్తే.. రాజీనామాల బాట!**

బొప్పాపూర్ స్థానికుల డిమాండ్‌ను పక్కనపెట్టి ఇతర గ్రామానికి చెందిన వ్యక్తికి ఏఎంసీ చైర్మన్ పదవి కేటాయిస్తే గ్రామ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా మూకుమ్మడిగా రాజీనామాలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని నాయకులు హెచ్చరించారు. స్థానిక కార్యకర్తల మనోభావాలను పార్టీ అధిష్ఠానం గౌరవించి, బొప్పాపూర్‌కు చెందిన అర్హుడైన కాంగ్రెస్ నాయకుడికే ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్, కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా వైస్ చైర్మన్ కొండాపురం వెంకట్‌రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షురాలు చల్ల పద్మారెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మొడుసు నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల కార్యదర్శి నీరటి భాను తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కొంగరి కిష్టారెడ్డి, ఏలూరి శ్రీనివాస్, అరికల రామచంద్రం, ఇల్లెందుల రాజిరెడ్డి, పని దేవరాజు, మొడుసు పద్మారెడ్డి, మరుపాక బాలపోషయ్య, బుర్రవేణి ఎల్లయ్య, కొండాపురం మల్లారెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా గిరిజన కాలనీలో ఉచిత వైద్య శిబిరం

### వైద్య పరీక్షలతో పాటు మందులు, దుప్పట్లు, చిన్నారులకు దుస్తుల పంపిణీ



అరుణ ప్రభ:- సారపాక దివంగత సానికుమ్మ కృష్ణారెడ్డి 24వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలం సారపాక శ్రీరాంపురం క్యాంపు గిరిజన కాలనీలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. పేద, గిరిజన కుటుంబాలకు ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాలనీవాసుల నుంచి మంచి స్పందన లభించింది.ఈ సందర్భంగా డాక్టర్ జక్కం రవీంద్ర (ఎంబీబీఎస్, చిల్డ్రన్ స్పెషలిస్ట్), డాక్టర్ నీరజ్ (డెంటిస్ట్) వైద్య సేవలు అందించారు. కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు రక్త పరీక్షలు చేయించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. చిన్నారులు, మహిళలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేకంగా వైద్యులు సూచనలు అందించారు.అనంతరం కాలనీవాసులకు మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. అలాగే కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దుప్పట్లు, చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాన్ని కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఆయన జ్ఞాపకార్థం నిర్వహించడం పట్ల కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. "పేదల ఆరోగ్యమే మా ధ్యేయం. ప్రజలంతా ఆరోగ్యంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాం. మా అన్నగారి జ్ఞాపకార్థం మాకు తోచినంతగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేద కుటుంబాలకు అండగా నిలవాలన్నదే మా ఉద్దేశం" అని తెలిపారు.సామాజిక సేవలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించి, అవసరమైన వారికి మందులు, దుస్తులు, దుప్పట్లు, భోజనం అందించడం అభినందనీయమని కాలనీవాసులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని వారు కోరుతూ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు



# రెండు సబ్‌స్టేషన్లు మంజూరు.. లోవోల్టేజీ సమస్యకు చెక్!

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, అక్టోబర్ 04: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు కావడంపై మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పధిర--హరిదాస్‌నగర్, బండలింగంపల్లి గ్రామాల పరిధిలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం మండల ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూడి రాజేందర్ అన్నారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బండలింగంపల్లి గ్రామంలో రూ.2.70 కోట్ల వ్యయంతో, పధిర--హరిదాస్‌నగర్ గ్రామాల పరిధిలో రూ.3.14 కోట్ల వ్యయంతో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో ఏళ్లుగా ఉన్న లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు రైతులు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందే అవకాశం ఉంటుందని రాజేందర్ తెలిపారు. సబ్‌స్టేషన్ల మంజూరుకు కృషి చేసిన సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఎన్పీడీసీఎల్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గుండాటి రామ్‌రెడ్డి, వంగ గిరిధర్‌రెడ్డి, షేక్ గౌస్, సద్ది లక్ష్మారెడ్డి, ఎస్‌కే సాహెబ్, నంది కిషన్, మండే శ్రీనివాస్, లింగం గౌడ్, శ్రీనివాస్, నారాయణ, రాములు, మూర్తి, వెంకటేష్, వంగ శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్, పోచయ్య, నరేందర్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకటవ పట్టణ సీఐ గా బాధ్యతలు చేపట్టిన జె.శ్రీనివాస్




గూడూరు - (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు ఒకటవ పట్టణ సీఐ గా జె.శ్రీనివాస్ ఆదివారం గూడూరు ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గూడూరు రెండో పట్టణ సీఐ గా విధులు నిర్వహించారు. తాజా గా బదిలీ ల్లో భాగంగా గూడూరు ఒకటవ పట్టణ సీఐ గా నియమితులైనారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ , శాంతి భద్రత ల పరిరక్షణకు కృషి చేస్తాను అన్నారు. అనంతరం పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



# ముక్క మౌనిక కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సర్పంచుల జేఏసీ

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, అక్టోబర్ 04: ల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ ముక్క శంకర్ గారి సతీమణి ముక్క మౌనిక మృతి చెందడంతో జిల్లా మాజీ సర్పంచుల జేఏసీ నాయకులు ఆదివారం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ముక్క శంకర్‌తో పాటు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మౌనిక మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు.మౌనిక గారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ముక్క శంకర్ కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సర్పంచుల జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వంగ శ్రీకాంత్‌రెడ్డి

### ఓటింగ్ ద్వారా శ్రీకాంత్ రెడ్డిని ఎన్నుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ ప్రతినిధి । అక్టోబర్ 03 : ఎల్లారెడ్డిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వంగ శ్రీకాంత్ రెడ్డి ఎన్నికయ్యారు. శనివారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష పదవికి గుర్రపు రాములు, కోనేటి పోచయ్య, మద్దుల శ్రీపాల్ రెడ్డి, పందిళ్ల శ్రీనివాస్ గౌడ్, వంగ శ్రీకాంత్ రెడ్డి, గంట వెంకటేష్ గౌడ్‌లు పోటీ పడ్డారు. ఎన్నికల ప్రక్రియకు హాజరైన మెజారిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓటింగ్‌లో వంగ శ్రీకాంత్ రెడ్డికి మద్దతుగా మెజారిటీ ఓట్లు రావడంతో ఆయనను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ఓటింగ్ ద్వారా ఎన్నికైన వంగ శ్రీకాంత్ రెడ్డి పేరును పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అధికారికంగా ప్రకటించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూడి రాజేందర్‌కు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడికి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

**పలువురు నాయకుల హాజరు.**

ఈ ఎన్నిక కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, ఎస్సీ, ఎస్టీ జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సభ్యుడు బీపేట రాజకుమార్, ఆత్మ కమిటీ సభ్యుడు ఏర్పుల శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పుల్లయ్యగారి తిరుపతి గౌడ్, కుర్మ మల్లేష్ యాదవ్, వార్డు సభ్యులు అంతేర్పుల గోపాల్, ద్యాగం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి బాలరెడ్డి, నంది కిషన్, మెండే శ్రీనివాస్ యాదవ్, సోషల్ మీడియా ప్రతినిధి ఇలియాస్ బాబా తదితరులు పాల్గొన్నారు.




# సేవ సేతు అభియాన్ ఆధ్వర్యంలో సౌర శక్తి వినియోగంపై అవగాహన సదస్సు

### సౌర విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ ఖర్చులు తగ్గింపు

అక్టోబర్ 4, అరుణ ప్రభ : ప్రజల్లో సౌర శక్తి వినియోగంపై అవగాహన కల్పించేందుకు సేవ సేతు అభియాన్, ఐసీఎస్సీ కీసర్ కేంద్రం ఆధ్వర్యంలో సౌర శక్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌర విద్యుత్ ప్రాధాన్యత, సోలార్ ప్యానెళ్ల వినియోగం, సౌర విద్యుత్ వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునే మార్గాలపై నిపుణులు అవగాహన కల్పించారు. సూర్యరశ్మిని విద్యుత్‌గా మార్చుకునే సౌర శక్తి పర్యావరణహితమైన, పునరుత్పాదక ఇంధన వనరు అని వారు తెలిపారు. ప్రతి ఇంటి వద్ద సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించడం ద్వారా విద్యుత్ ఆదాతో పాటు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించవచ్చని పేర్కొన్నారు. సౌర శక్తి వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు ఇలాంటి సదస్సులు నిరంతరం నిర్వహించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యుత్ వినియోగదారులు, సౌర శక్తి రంగ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.





# ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ

### జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

### ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

అక్టోబర్ 04, అరుణ ప్రభ... జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డి ల ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి విచ్చేసి పలువురు జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ బాండ్లను ఎమ్మెల్యే అందజేశారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి ఆర్థిక సాయంతో జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, వారి సంక్షేమం, భద్రత కు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో గుడి మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, నేర్థం భాస్కర్ గౌడ్, నాయకులు ఈరెల్లి రవీందర్ రెడ్డి, తిరుమలేష్, కొంపల్లి రవీందర్, పల్లె రాజకుమార్ గౌడ్, గడ్డం పాపి రెడ్డి, పిట్టల నరేష్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి నర్సింహా రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా సీసా నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ బోడ ప్రవీణ్, ఇడపాక సురేష్, కమిటీ సభ్యులు వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశంలో ఆత్మవిశ్వాసం యువతకు స్మిత్ మచ్చార్ సందేశం

### బాధ్యత ముందు ... భయం వెనుక

అరుణప్రభ 4 అక్టోబర్ మహబూబాబాద్ అర్బన్ : జీవితంలో కొన్ని క్షణాలు మనిషి వ్యక్తిత్వాన్ని పరీక్షిస్తాయి. ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయం మన జీవితాన్నే కాదు, మన చుట్టూ ఉన్న అనేక మంది జీవితాలను కూడా ప్రభావితం చేయవచ్చు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యం, శిక్షణ, కర్తవ్యనిబద్ధత ఎంత ముఖ్యమో తాజాగా ప్రపంచం ముందుకు వచ్చిన ఫ్లై దుబాయ్ కెప్టెన్ స్మిత్ మచ్చార్ ఘటన మరోసారి గుర్తుచేసింది. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానంలో సెప్టెంబర్ 30న తీవ్ర అత్యవసర పరిస్థితి ఏర్పడింది. కెప్టెన్ మచ్చార్ తీవ్రంగా గాయపడినప్పటికీ, పరిస్థితిని అర్థం చేసుకుని విమానం సురక్షితంగా మళ్లించడంలో కీలకంగా వ్యవహరించాడు. విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించి అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్మిత్ మచ్చార్ 2022 నుంచి ఫ్లై దుబాయ్‌లో కెప్టెన్‌గా పనిచేస్తున్నాడు. అంతకుముందు సుమారు 11 సంవత్సరాలు స్పైస్‌జెట్‌లో పనిచేశాడు . ఆయనకు వేల గంటల విమాన ప్రయాణ అనుభవం ఉంది; ఇతర పైలట్లకు శిక్షణ ఇచ్చిన అనుభవం కూడా ఉన్నది .

### ఇక్కడ యువత నేర్చుకోవాల్సిన మొదటి పాఠం ఇదే ---

విజయం ఒక్కరోజులో కనిపిస్తుంది . కానీ ఆ విజయానికి పునాది ఎన్నో సంవత్సరాల కృషి ఉంటుంది .ఎవరైనా ఒక వ్యక్తిని క్లిష్ట పరిస్థితుల్లో ధైర్యంగా నిలబడటం చూస్తారు. కానీ ఆ ధైర్యం వెనుక ఉన్న శిక్షణ, క్రమశిక్షణ, అనుభవం, నిరంతర సాధన చాలామందికి కనిపించదు. ఘటన అనంతరం తన అనుభవాన్ని వివరిస్తూ, తాను తీవ్రంగా గాయపడి నేలపై పడిపోయానని, విమానం కిందకు పడిపోతున్న విషయం తనకు అర్థమైందని కెప్టెన్ మచ్చార్ చెప్పినట్లు తెలుస్తుంది . ప్రయాణికుల ప్రాణాల గురించి ఆలోచించడమే తనను మళ్లీ చర్య తీసుకునేలా చేసిందని ఆయన వివరించారు.

ఈ మాటలు యువతకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తాయి: భయం లేకపోవడమే ధైర్యం కాదు . భయం ఉన్నప్పటికీ బాధ్యతను నిర్వర్తించడమే నిజమైన ధైర్యం .జీవితంలో పరీక్షలు, ఉద్యోగంలో ఒత్తిళ్లు, వ్యాపారంలో నష్టాలు, చదువులో వైఫల్యాలు---ఏదైనా ఎదురైనా సమస్యను చూసి పారిపోవడం కాకుండా, పరిస్థితిని అర్థం చేసుకుని పరిష్కారం కోసం ప్రయత్నించాలి.

### యువతకు స్మిత్ మచ్చార్ సంఘటన చెప్పే ఐదు పాఠాలు

1. కలలు కనండి -- కానీ వాటి కోసం కష్టపడండి పైలట్ కావాలనే కల ఉండటం ఒక విషయం. ఆ కలను నిజం చేసుకోవడానికి నిరంతర శిక్షణ, క్రమశిక్షణ, విద్య అవసరం.

2. నైపుణ్యానికి ప్రత్యామ్నాయం లేదు : అదృష్టం కొన్నిసార్లు అవకాశం ఇస్తుంది. కానీ క్లిష్ట సమయంలో మనల్ని నిలబెట్టేది మన నైపుణ్యం.

### 3. ఒత్తిడిలో ఆలోచించే శక్తిని పెంచుకోండి :

జీవితంలో ప్రతి సమస్యకు వెంటనే సమాధానం కనిపించదు. ప్రశాంతంగా పరిస్థితిని అర్థం చేసుకుని నిర్ణయం తీసుకునే అలవాటు యువతలో ఉండాలి.

4. వ్యక్తిగత విజయాన్ని సామాజిక బాధ్యతతో కలపండి : మన ప్రతిభ మనకోసం మాత్రమే కాదు. మన కుటుంబానికి, సంస్థకు, సమాజానికి ఉపయోగపడినప్పుడే దాని విలువ మరింత పెరుగుతుంది.

### 5. ప్రతిరోజూ నేర్చుకుంటూ ఉండండి :

ఎంత అనుభవం వచ్చినా నేర్చుకోవడం ఆపకూడదు. సాంకేతికత మారుతుంది, పరిస్థితులు మారతాయి. మార్పుకు అనుగుణంగా మనల్ని మనం అభివృద్ధి చేసుకోవాలి.

యువతకు ఒక ఆకాశ సందేశం : నేటి యువతలో ప్రతిభకు కొదవ లేదు. కానీ వేగంగా విజయం సాధించాలనే ఆత్రుత ఎక్కువగా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో కనిపించే విజయాల వెనుక సంవత్సరాల కృషి ఉంటుందని గుర్తించాలి. "అవకాశం వచ్చినప్పుడు సిద్ధంగా ఉండాలంటే, అవకాశం రాకముందే మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి."



ఆకాశంలో విమానం నడిపే పైలట్‌కు దారి చూపేది కేవలం యంత్రాలు కాదు–శిక్షణ, క్రమశిక్షణ, అప్రమత్తత, నిర్ణయ సామర్థ్యం.

### అదే సూత్రం జీవితానికీ వర్తిస్తుంది.

యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకోవాలి. చిన్న వైఫల్యాలకు భయపడకూడదు. నైపుణ్యాలను పెంచుకోవాలి. సమయాన్ని విలువైనదిగా భావించాలి. ముఖ్యంగా–ఎంత ఎత్తుకు ఎదిగినా బాధ్యతను మరచిపోకూడదు.

**డాక్టర్ ఉమ్మగాని అరుణ్ కుమార్**
కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, ప్రిన్సిపల్ , మార్గదర్శి B.Ed కళాశాల , మహబూబాద్

# మీసేవలో ధరల పట్టిక ప్రకారమే చార్జీలు

### రశీదు ఇవ్వకుంటే ఫిర్యాదు చేయండి

### అదనపు వసూళ్లకు పాల్పడితే నిర్వాహకులపై చర్యలు



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, అక్టోబర్ 04: మీసేవ కేంద్రాల్లో ప్రజలు ధరల పట్టిక ప్రకారం మాత్రమే బిల్లులు చెల్లించి, తప్పనిసరిగా రశీదు పొందాలని రాజన్న సిరిసిల్ల జిల్లా మీసేవ సెంటర్ల ఈడీఎం శ్రీనివాస్ సూచించారు. నిర్ణయించిన ధరల కంటే అదనంగా చార్జీలు వసూలు చేస్తే, అందుకు సంబంధించిన ఆధారాలతో తమకు ఫిర్యాదు చేయాలని, విచారణ అనంతరం సంబంధిత మీసేవ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని విశ్వం మీసేవ కేంద్రాన్ని ఆదివారం ఈడీఎం శ్రీనివాస్, డీఎం మహేష్ కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఇటీవల విశ్వం మీసేవ కేంద్రంలో జరిగిన ఘటనపై సంబంధిత ఆపరేటర్‌ను తొలగించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం కొత్త ఆపరేటర్‌ను నియమించి, ఆపరేటర్‌తో పాటు యజమాని మల్లేశంకు లాగిన్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, ప్రస్తుతం పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. అనంతరం విలేకరులతో ఈడీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 92 మీసేవ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. అన్ని కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టిక ప్రకారమే సేవలకు చార్జీలు వసూలు చేయాలని సూచించారు. అదనంగా డబ్బులు వసూలు చేస్తే ప్రజలు భయపడకుండా ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజల అవసరాలను బట్టి మీసేవ కేంద్రాల్లో ఏర్పడే ఖాళీలను భర్తీ చేస్తున్నామని, స్థానికులకు ప్రాధాన్యతనిస్తూ ఇంటర్వ్యూల ద్వారా నిర్వాహకులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లల ఆధార్ కార్డుల విషయంలో మీసేవ నిర్వాహకులకు ఎలాంటి చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ఈడీఎం శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజలు మీసేవ కేంద్రాల్లో సేవలు పొందే సమయంలో ధరల పట్టికను పరిశీలించి, చెల్లించిన ప్రతి మొత్తానికి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన సూచించారు.

# భాస్కర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సమస్యల తిష్ట!

### టీచర్ల కొరత.. అస్తవ్యస్తంగా పరిసరాలు.. కనీస వసతులు కరువు

### క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని తల్లిదండ్రుల డిమాండ్




అరుణ ప్రభ :- సారపాక గ్రామపంచాయతీ పరిధిలోని భాస్కర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్య, మౌలిక వసతులు అందడం లేదని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో పాటు పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సమస్యలు ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో ఒకరు అనారోగ్యానికి గురికావడంతో బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఉపాధ్యాయుల కొరతను వెంటనే పరిష్కరించి, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పూర్తిస్థాయి ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు.

### పరిసరాల్లో పారిశుద్ధ్య సమస్యలు

పాఠశాల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు మద్యం సీసాలు కనిపిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు పాఠశాల పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు. బాలురు, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు అందించే పౌష్టికాహారం నాణ్యతపై కూడా కొందరు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షించాలని కోరుతున్నారు.

### క్షేత్రస్థాయిలో విచారణ చేయాలి

పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించడంతో పాటు పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్య వాతావరణం అందించాలని విజ్ఞప్తి చేశారు.

### పంచాయతీ కార్యదర్శి వివరణ

పాఠశాల పారిశుద్ధ్య సమస్యలు తమ దృష్టికి ఇంతవరకు రాలేదని సారపాక మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు. పాఠశాల తరపున సమాచారం అందిస్తే శానిటేషన్ సిబ్బందిని పంపించి క్లీనింగ్ పనులు చేపడతామని తెలియజేశారు. ఈరోజు అందుకున్న సమాచారం మేరకు పంచాయతీ సూపర్వైజర్ కు తెలియజేసి పాఠశాలకు పంపించినట్లు తెలియపరిచారు. సారపాక మేజర్ గ్రామపంచాయతీలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ సమస్యలు ఉంది సిబ్బంది లేకుంటే తమ దృష్టికి తీసుకువస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.




## కాలేజీ మైదానానికి చెత్త కష్టాలు

ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : పట్టణంలోని కాలేజీ క్రీడామైదానం చెత్తతో అపరిశుభ్రంగా మారడంతో వాకింగ్, వ్యాయామం చేసుకునే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మైదానాన్ని వెంటనే శుభ్రం చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పట్టణ ప్రజలు, వాకింగ్‌దారులు కోరుతున్నారు. ఇటీవల మైదానాన్ని 104 వాహనాల పార్కింగ్, సామగ్రి నిల్వకు వినియోగించిన అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆహారపు ప్లేట్లు తదితర చెత్త పేరుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వందలాది మంది వాకింగ్, వ్యాయామం కోసం మైదానాన్ని వినియోగిస్తున్నారని చెప్పారు. మైదానంలోని చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచడంతో పాటు శాశ్వత వాకింగ్ ట్రాక్, లైటింగ్, చెత్తబుట్టలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. భవిష్యత్తులో చెత్త పేరుకుపోకుండా నిరంతర పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య సమస్యను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరారు



## గాంధీ జయంతి రోజు దళిత మహిళపై దాడి దురదృష్టకరం

### బోడుప్పల్లో 398వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల

### మహిళల జోలికొస్తే కఠిన చర్యలు అమలు చేయాలి

### అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య

అక్టోబర్ 4, అరుణ ప్రభ : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 398వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామం అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి రోజున గనిపల్లి మాధవి అనే దళిత మహిళ పైన అదే గ్రామానికి చెందిన కొప్పోలు అమర్నాథ్ గౌడ్ అనే వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆమెపై దాడి చేశాడు. ఈ సంఘటనను అంబేద్కర్ ఆశయ సాధన సంఘం తీవ్రంగా ఖండిస్తుందని, మహిళలపై దాడి చేయడం దురదృష్టకరమని తక్షణమే దాడి చేసిన వ్యక్తి పై ఎస్సీ అట్రాసిటీ కేసుతోపాటు పిడి యాక్ట్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తూ, తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించిన మహిళలపై దాడి చేయడం హేయమైన చర్య అని నత్తి మైసయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గరుగుల యాకయ్య, సాయి బండారి, శ్రీధర్ గుప్తా, రాపోలు వెంకటేష్, చిల్ల అంజయ్య, గుంజి శ్రీనివాస్ డింపు తదితరులు పాల్గొన్నారు.




## మహబూబాబాద్ మెడికల్ కాలేజీకి మృతదేహం

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అప్పగింత

### నెల రోజుల వ్యవధిలోనే మూడు మృతదేహాలు అప్పగింత

అరుణప్రభ 4 అక్టోబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్: మానుకోట మెడికల్ కళాశాలకు మోత్కూరు పరమేశ్వర్ అనే వ్యక్తి మృతదేహం ఆదివారం అప్పగించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ ఆధ్వర్యంలో మండల స్వర్ణకార సంఘం సహకారంతో శనివారం మృతి చెందిన పరమేశ్వర్ (60)పార్థివదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించారు. మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన పరమేశ్వర్ శనివారం అస్వస్థతకు గురయ్యారు. ఆయనను హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆయన ఆరోగ్యం విషమించడంతో కన్నుమూశారు. మృతుడి సోదరులు ప్రభాకర్ తోపాటు స్వర్ణకారుల సంఘం సహకారంతో ఆయన మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు లయన్స్ క్లబ్ సీనియర్ బాధ్యులు కొండపల్లి కేశవరావు, క్లబ్ సెక్రటరీ పారుపల్లి రమేష్ బాబు, పరకాల రవీందర్ రెడ్డి, జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు మోత్కూరు శంకర్, మండల సంఘం అధ్యక్షులు పమ్మి సనాతన చారి, వంగాల పూర్ణాచారి, బండోజు ఉపేంద్రా చారిలు ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ బి. జగదీశ్వర్, సీ.ఎం.ఓ డాక్టర్ రాంరెడ్డి సమక్షంలో మెడికల్ కళాశాల ఆనాటమీ హెచ్ .ఓ.డి డాక్టర్ భరత్ కుమార్ కు పరమేశ్వర్ మృతదేహాన్ని అందజేశారు. కాగా మానుకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత నెల రోజుల వ్యవధిలోనే మూడు పార్థివ దేహాలను అప్పగించినట్లు క్లబ్ నిర్వాహకులు వెల్లడించారు. బావి వైద్యులకు తమ వైద్య పరీక్షలకోసం ప్రతి ఏటా 15 మృతదేహాలు అవసరమవుతాయని వారు పేర్కొన్నారు. ఈ విషయం గుర్తించి అవయవ, మృత దేహాలను దానం చేసేందుకు ముందుకు రావాలని, అందుకు లయన్స్ క్లబ్ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేస్తుందని వారు తెలిపారు.

## ధర్మవరం యువతకు ఉచిత డిఫెన్స్ శిక్షణ




ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : ఆర్మీ, పోలీస్, పారా మిలిటరీ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న ధర్మవరం నియోజకవర్గ యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ తీసుకున్నట్లు ఆయన కార్యాలయం తెలిపింది. సంస్కృతి సేవా సమితి సహకారంతో తిరుపతికి చెందిన ఎస్వీ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన శిక్షణ పొందలేని ప్రతిభావంతులైన యువతకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. శారీరక దారుఢ్యం, పరుగు, రాత పరీక్షలు, ఎంపిక ప్రక్రియ తదితర అంశాల్లో అభ్యర్థులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించనున్నారు. ఇప్పటికే నిర్వహించిన శిక్షణలో అగ్నివీర్ ఎంపికకు 236 మంది హాజరు కాగా, 220 మంది ఎంపికైనట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ ఫలితాల నేపథ్యంలో ఇకపై ప్రతి ఏటా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన 100 మంది యువతను ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపింది. దేశసేవ చేయాలనే లక్ష్యం ఉన్న అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కార్యాలయం సూచించింది. వివరాలకు: మల్లిఖార్జున – 7998256789, నరేంద్ర –9490442576.

# బెల్ట్ షాపుల బారిన పల్లెలు.. పట్టించుకునేదెవరు?

**అర్ధరాత్రి దాటినా యథేచ్ఛగా మద్యం విక్రయాలు..**

**అధిక ధరలతో మందుబాబులపై అదనపు భారం.**

**తండాలపై దాడులు కాదు.. గ్రామాల్లోని**

**అనధికారిక బెల్ట్ షాపులపైనా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్.**

**యువత, పేద కుటుంబాల ఆరోగ్యంపై ప్రభావం.. ఎక్సైజ్ ఉన్నతాధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి.**





ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అనధికారికంగా కొనసాగుతున్న బెల్ట్ షాపుల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ప్రాంతాల్లో రాత్రివేళల్లోనూ మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా మద్యం అందుబాటులో ఉండటంతో యువత, కార్మికులు, నిరుపేద కుటుంబాలపై దాని ప్రభావం పడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రాత్రి వేళల్లోనూ విక్రయాలా?

మండల కేంద్రంలో కొన్ని బెల్ట్ షాపులు అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగుతున్నాయనే ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? జరిగితే వాటి వెనుక ఎవరున్నారు? అనే అంశాలపై అధికారులు పారదర్శకంగా విచారణ జరపాలని డిమాండ్ వినిపిస్తోంది. బెల్ట్ షాపులపై అధికారులు చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

### ఎంఆర్‌పీకి మించి.. అదనపు వసూళ్ల ఆరోపణలు.

గ్రామాల్లోని అనధికారిక మద్యం విక్రయ కేంద్రాల వద్ద ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో మద్యం బాటిళ్లపై ప్రత్యేక స్టిక్కర్లు అంటించి అదనపు మొత్తాన్ని వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతితో నడిచే మద్యం దుకాణాల నుంచి బయటకు వెళ్లే మద్యం బెల్ట్ షాపులకు ఎలా చేరుతోంది? దాని ధరలు ఎవరు నిర్ణయిస్తున్నారు? బాటిళ్లపై అదనపు స్టిక్కర్లు ఎవరు వేస్తున్నారు? అనే ప్రశ్నలకు ఎక్సైజ్ శాఖ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

### బెల్ట్ షాపు.. గ్రామానికి మరో సమస్య?

గ్రామాల్లో మద్యం సులభంగా అందుబాటులోకి రావడంతో కొంతమంది యువకులు, పురుషులు మద్యం సేవనానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం ఆరోగ్యానికి హానికరమని తెలిసినా అందుబాటులో ఉండటం వల్ల అలవాటు పెరుగుతోందన్నది వారి ఆందోళన. మద్యం కొనుగోలు కోసం కుటుంబ ఆదాయంలో అధిక భాగం ఖర్చు కావడం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు వంటి సమస్యలకు మద్యపానం ఒక కారణంగా మారుతోందని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు.

### తండాల్లో దాడులు.. బెల్ట్ షాపులపై ఎందుకు మౌనం?

ఇదే సమయంలో గిరిజన తండాల్లో సంప్రదాయంగా ఇంటి అవసరాల కోసం తయారు చేసుకునే సారా విషయంలో ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహిస్తున్న తీరుపై కొన్ని గిరిజన సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ వాదన ప్రకారం, తండాల్లో దాడులు నిర్వహించే ముందు గ్రామాల్లో బహిరంగంగా లేదా అనధికారికంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులపై కూడా సమాన స్థాయిలో చర్యలు తీసుకోవాలి. గిరిజనులపై మాత్రమే నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నారనే భావన కలగకుండా, నిబంధనలు ఉల్లంఘించే ప్రతి ఒక్కరిపైనా ఒకే విధమైన చర్యలు ఉండాలని వారు కోరుతున్నారు. అయితే సారా తయారీ, విక్రయాలకు సంబంధించి చట్టపరమైన నిబంధనలు వేరుగా ఉన్నందున, సంప్రదాయం పేరుతో నిషేధిత మద్యం తయారీకి మినహాయింపు ఇవ్వాలన్నది కాకుండా, చట్ట అమలులో సమానత్వం పాటించాలన్నదే గిరిజన సంఘాల ప్రధాన డిమాండ్‌గా వారు చెబుతున్నారు.

### నకిలీ మద్యం.. కల్తీ మద్యం ఆరోపణలపై దృష్టి సారించాలి

మద్యం దుకాణాలు, అనధికారిక విక్రయ కేంద్రాల్లో విక్రయిస్తున్న మద్యం నాణ్యతపై కూడా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. నకిలీ లేదా కల్తీ మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు నిజమా? కాదా? అన్నది అధికారిక తనిఖీల ద్వారానే తేలాలని అంటున్నారు. మద్యం బాటిళ్ల బ్యాచ్ నంబర్లు, సీల్, లేబుల్, ధర, సరఫరా వివరాలు తదితర అంశాలను ఎక్సైజ్ అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు అంటున్నారు.

### ఎక్సైజ్ శాఖపై మరో కీలక ప్రశ్న

గ్రామాల్లో బెల్ట్ షాపులు ఎక్కడెక్కడ ఉన్నాయో అధికారులకు తెలియదా? తెలిసి ఉంటే వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? అనధికారికంగా మద్యం విక్రయించే కేంద్రాలకు మద్యం సరఫరా అవుతున్న మార్గం ఏమిటి? అనే ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి బెల్ట్ షాపులకు మద్యం వెళ్తున్నట్లయితే ఆ సరఫరా గొలుసును గుర్తించడం ఎవరి బాధ్యత? అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లయితే వాటిపై తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత ఎవరిపై ఉంది? అనే ప్రశ్నలకు సమాధానం అవసరమని స్థానికులు అంటున్నారు. అధికారుల కింది స్థాయి సిబ్బంది విధుల నిర్వహణపై కూడా ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచాలని, ఎక్కడైనా విధుల్లో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు సహకారం ఉందనే ఆరోపణలు ఉంటే వాటిపై అంతర్గతంగా విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రభుత్వం.. అధికారులు.. ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన సమయం

ఇది కేవలం మద్యం విక్రయాల సమస్యగా కాకుండా ప్రజారోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితి, యువత భవిష్యత్తు, చట్ట అమలు వంటి అనేక అంశాలతో ముడిపడిన సామాజిక సమస్యగా చూడాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం మద్యం విక్రయాలపై విధించిన నిబంధనలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా అన్నది పరిశీలించాలి. ఎక్సైజ్ అధికారులు గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించి అనధికారిక బెల్ట్ షాపులను గుర్తించాలి. అధిక ధరల వసూళ్లపై ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించాలి. నకిలీ, కల్తీ మద్యం ఆరోపణలపై శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలి.

### అన్ని పార్టీల నేతలు కూడా స్పందించాలి

ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తు వంటి అంశాలపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. బెల్ట్ షాపులు ఎవరి ఆధ్వర్యంలో ఉన్నా.. ఏ పార్టీకి చెందిన వారి అండ ఉన్నా.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా ప్రజారోగ్యానికి సంబంధించిన అంశంపై రాజకీయ నాయకులు అధికారులను ప్రశ్నించాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### ఒకే ప్రశ్న.. నిబంధనలు అందరికీ సమానమేనా?

తండాల్లో నిబంధనల అమలుకు అధికారులు వెళ్లడం అవసరమే అయితే, అదే సమయంలో గ్రామాల్లో అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న బెల్ట్ షాపులపై కూడా చర్యలు ఉండాలి. చట్టం అందరికీ సమానమైతే.. చర్యలు కూడా అందరిపైనా సమానంగా ఉండాలి. బెల్ట్ షాపులు నిజంగా ఎక్కడెక్కడ కొనసాగుతున్నాయి? వాటికి మద్యం ఎలా చేరుతోంది? ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయా? మద్యం నాణ్యతను ఎవరు తనిఖీ చేస్తున్నారు? రాత్రి వేళల్లో విక్రయాలను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అనే ప్రశ్నలకు ఎక్సైజ్ శాఖ సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. తండాలపై దాడులు మాత్రమే కాదు.. గ్రామాల్లోని అనధికారిక బెల్ట్ షాపులపైనా సమాన దృష్టి సారించాలి. ప్రజారోగ్యాన్ని కాపాడటం, నిబంధనలను అమలు చేయడం, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. ఎల్లారెడ్డిపేట మండల ప్రజలు ఇప్పుడు అధికారుల నుంచి కోరుతున్నది ఒక్కటే---బెల్ట్ షాపులపై సమగ్ర తనిఖీలు.. నిబంధనల ఉల్లంఘనలపై పారదర్శక చర్యలు.. మద్యం విక్రయాలపై కఠిన పర్యవేక్షణ. ప్రజల ప్రశ్నలకు అధికారుల సమాధానం ఏమిటో వేచి చూడాలి.

# పీర్జాదిగూడ డివిజన్ ఎమ్మార్వో కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహణ

**మెగా హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన**

**ఆరోగ్య పరీక్షలు, నిపుణుల వైద్య సేవలు**

**ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీరాములు గౌడ్**



అక్టోబర్ 4, అరుణ ప్రభ : మేడిపల్లి మండల ఎమ్మార్వో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీరాములు గౌడ్ హాజరయ్యారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరంలో వందలాది మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ అనిల్ కుమార్,డాక్టర్ బాలకృష్ణ,డాక్టర్ ఇమ్రాన్ కాజ్మీ,డాక్టర్ స్పందన,డాక్టర్ అనూష పటేల్,డాక్టర్ సుష్మ,డాక్టర్ మధు తదితర వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు.సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తపోటు,మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరం నిర్వహణలో ఆసుపత్రి సిబ్బందిఅనూష,భరత్ సురేష్,సంగీత,స్వప్న,నవ్య,వాసు,శ్రీహరి, సుష్మితలు కీలక పాత్ర పోషించారు.ఈ సందర్భంగా ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను తరచూ నిర్వహించాలని కోరగా నిర్వాహకులు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు.




# జనవిజ్ఞాన వేదిక జిల్లా 6వ మహాసభ విజయవంతం

**నూతన కార్యవర్గ నియామకం.**

**జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆగుర్తి సురేష్, అధ్యక్షులుగా చిర్రా యాకంతం**





అరుణప్రభ 4 అక్టోబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని బాలికల జూనియర్ కళాశాల నందు జన విజ్ఞాన వేదిక, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు, సాహితీ శ్రీనివాస్ అధ్యక్షతన 6వ జిల్లా మహాసభలు జరిగాయి. సీనియర్ నాయకులు, పి. మంగపతిరావు జాతీయ పతాకాన్ని, మైస నాగయ్య జనవిజ్ఞాన వేదిక పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులుగా జె. శ్రీనాథ్ హాజరై మాట్లాడుతూ... జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర, జిల్లా, మండల కమిటీలుగా 9 ముఖ్య ఆశయాలతో పనిచేస్తుందని, శాస్త్రము, ప్రచారం, పోరాటం అనే అంశాలపై అవగాహన కల్పించేందుకు విశేషంగా కృషిచేస్తుందని, సైన్సును ప్రజలకు చేరువ చేయడంలో జన విజ్ఞాన వేదిక విశేషంగా కృషిచేస్తుందని, మతానికి, కులానికి, దేవుడికి వ్యతిరేకం కాదని, వ్యక్తిగత నమ్మకాలను సదా గౌరవిస్తుందని, ఈ కోవలోనే ఎన్నో ఫలితాలను సాధించిందని, ఒక్కోసారి ఈ నాటి కృషి రేపటి ఫలితాలుగా మారతాయని, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా మాత్రమే పోరాడే సంస్థ కాదని, విస్తృత స్థాయిలో శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు విశేషంగా కృషిచేస్తుందని, గతంలో సాధించిన ఫలితాలను ప్రస్తావిస్తూ ముగించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా నూతన కమిటీని ప్రకటించి శుభాకాంక్షలు తెలిపారు. గౌరవ అతిథులుగా రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ లింగంపల్లి దయానంద్ మాట్లాడుతూ... సమాజం మనకేమి ఇచ్చిందని కాకుండా, సమాజం కోసం మనమేజేశామని ఆలోచించే కార్యకర్తలే జన విజ్ఞాన కార్యకర్తలని, మహబాద్ జిల్లా శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ముఖ్య అతిథిగా సబ్ ఇన్స్పెక్టర్, మహబూబాబాద్ టౌన్, సి.హెచ్. అరుణ్ కుమార్ హాజరై ప్రసంగించారు. సమాజంలో ఎంత చదువుకున్నా ఇంకా అశాస్త్రీయ భావాలు ఉండడం బాధాకరమని, ఇంకా చేతబడులనే నెపంతో బాధించడం చూస్తున్నామని, సమాజంలోని కొందరు యువత విపరీత ధోరణులు అనుసరించడం, అవాంఛనీయ సంఘటనలకు పాలుపడడం వంటివి చూడాల్సి వస్తుందని, జన విజ్ఞాన వేదిక వంటి శాస్త్రీయ ప్రచార సంస్థలు ఉండడం శుభపరిణామమని తెలిపారు. ప్రధాన కార్యదర్శి, చొప్పరి శ్రీనివాస్ కార్యదర్శి నివేదిక, ట్రెజరర్ ఇమ్మడి సునిత తమ నివేదికలను సభకు సమర్పించారు. తర్వాత వివిధ మండలాల నివేదికలను మండల కార్యదర్శులు సమర్పించారు. తదనంతరం 2026-28 కాలానికిగాను నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా చిర్రా యాకంతం, ప్రధాన కార్యదర్శిగా ఆగుర్తి సురేష్, చెకిముఖి కన్వీనర్ గా ఐనాల నవీన్, కోశాధికారిగా ఉప్పల శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఇంకా ఈ కార్యక్రమంలో బ్రహ్మం, ఆర్ .వి ప్రసాద్, యాకయ్య, పి.సాంబయ్య, రాము, సుభాన్, విజయ్ రాజ్, యు. శ్రీరాములు, వి. ఓం ప్రకాష్, వెంకట నారాయణ, పాషా, ప్రభాకర్, యం. రమేష్, వెంకట్రామ నర్సయ్య, చక్రధర్, దుర్గయ్య, రాజేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. జిక్కి నాగేశ్వర్, సాధ్వీమణీ ఆలపించిన గీతాలు విశేషంగా అలరించాయి

# సీతారామ ప్రాజెక్టును ఇల్లందు ఎమ్మెల్యేతో పరిశీలించిన ఎమ్మెల్యే మురళీనాయక్





అరుణప్రభ 4 అక్టోబర్ మహబూబాబాద్ అర్బన్ : వైరా నియోజకవర్గం కారేపల్లి, మండలం, చీమలపాడు గ్రామం నందు సీతారామ ప్రాజెక్టు ద్వారాఇల్లందు,మహబూబాబాద్ నియోజకవర్గాలకు సాగునీరు అందించే అవకాశాలపై మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ సీతారామ ప్రాజెక్టును సందర్శించి పరిశీలించారు మొదటిసారిగా ఇల్లందు నియోజకవర్గానికి విచ్చేసిన మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్ దంపతులను ఎమ్మెల్యే కోరం కనకయ్య శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన కుడి కాలువ నిర్మాణం, నీటి ప్రవాహం, కాలువల ద్వారా నీటిని ఇల్లందు నుంచి మహబూబాబాద్ నియోజకవర్గానికి తరలించే అవకాశాలను ఎమ్మెల్యేలు అధికారులతో కలిసి మున్సిపల్ ఛైర్పర్సన్ జ్యోతి పరిశీలించారు. సీతారామ ప్రాజెక్టు నీటిని సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకువస్తే ఇల్లందు, మహబూబాబాద్ నియోజక వర్గాల పరిధిలోని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని, అదేవిధంగా పట్టణ కేంద్రంలో తాగునీటి సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం చేయవచ్చని తెలిపారు. రైతులకు సాగునీటి కొరత లేకుండా చేయడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా.. అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరును సద్వినియోగం చేసి సాగుభూములకు, పట్టణ కేంద్రంలోని ప్రజలకు త్రాగు నీరందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మహబూ బాబాద్ జిల్లా కార్యదర్శి మూల మధుకర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు వేలపుల శ్రీనివాస్, నీటిపారుదల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు




# ఈనపల్లి లక్ష్మికి ఘన నివాళి

## దశదిన కర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీటీసీ, మాజీ సొసైటీ చైర్మన్

అరుణ ప్రభ బూర్గంపాడు:- మండల పరిధిలోని మోతేపట్టినగర్‌లో బీఆర్ఎస్ నాయకులు ఈనపల్లి వెంకటేశ్వర్లు, ఈనపల్లి శ్రీను తల్లి ఈనపల్లి లక్ష్మి దశదిన కర్మ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు హాజరై ఈనపల్లి లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, మాజీ సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాస్ కార్యక్రమానికి హాజరై లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుమారులు ఈనపల్లి వెంకటేశ్వర్లు, ఈనపల్లి శ్రీను, కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లక్ష్మి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈనపల్లి లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.కార్యక్రమంలో బూర్గంపహాడ్ మండలం బిఆర్ఎస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్ బీఆర్ఎస్ సారపాక టౌన్ ప్రెసిడెంట్ కొనకంచి శ్రీను, బెజ్జంకి కనకాచారి, చైతన్యరెడ్డి, పంగి సురేష్, పేరాల శ్రీను, తుపాకుల రవి, బానోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు



ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : జాతీయ ఉపకార వేతన అర్హత పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ సంయుక్తంగా రూపొందించిన పుస్తకాలను యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లో అర్హత సాధిస్తే కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడేలా విషయ పరిజ్ఞానాన్ని పుస్తక రూపంలో రూపొందించి ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని వారు కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వి.లోకేష్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణనాయక్, జిల్లా కార్యదర్శి అమర్‌నారాయణరెడ్డి, కౌన్సిలర్ మేరీవర కుమారి, యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 30 మందికి కంటి శస్త్రచికిత్సకు ఎంపిక

ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : యువర్స్ ఫౌండేషన్--ధర్మవరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పలువురు హాజరై వైద్య సేవలు పొందారు. శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30 మంది శస్త్రచికిత్సకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన వారికి తదుపరి దశలో కంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి సహకరించిన క్యాంప్ డోనర్ బి.ఆర్. రంగనాథం, డాక్టర్ భరత్‌లను ఫౌండేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బండ్లపల్లి రంగనాథ్, చాంద్‌బాషా, రేణాటి జయరాము, చౌటిపల్లి రాధాకృష్ణ, గర్రి రమేష్‌బాబు, కేతా లోకేష్, వెంకటమోహన్, భీమిశెట్టి కృష్ణమూర్తి, కేఎన్ కళ్యాణ్ చక్రవర్తి, ఓవీ ప్రసాద్, కీర్తిమాల, శంకు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు మరిన్ని ఆరోగ్య, సేవా కార్యక్రమాలు అందించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# నాగోల్ పోలీస్ స్టేషన్ GSI డివిజన్ పరిధిలోని దేవాలయాలకు భద్రత కల్పించాలి

## దిల్సుఖ్‌నగర్ సంతోష్ మాత దేవాలయంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి




హైదరాబాద్: నాగోల్ పోలీస్ స్టేషన్ GSI డివిజన్ పరిధిలోని దేవాలయాలకు ప్రత్యేక భద్రత కల్పించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతూ బీజేపీ GSI డివిజన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నాగోల్ పోలీస్ స్టేషన్ సి.ఐ. మాక్బుల్ జానీ గారికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల దిల్సుఖ్‌నగర్‌లోని సంతోష్ మాత దేవాలయంలో జరిగిన దురదృష్టకర సంఘటనను దృష్టిలో ఉంచుకుని, నాగోల్ పోలీస్ స్టేషన్ GSI డివిజన్ పరిధిలోని అన్ని దేవాలయాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని వినతిపత్రంలో కోరారు. దేవాలయాలు ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు కేంద్రాలైనందున, భక్తులు, ఆలయ సిబ్బంది మరియు ప్రజలకు పూర్తి భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, అవసరమైన ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్, నిఘా మరియు ఇతర భద్రతా చర్యలను పెంచాలని కోరారు. దిల్సుఖ్‌నగర్ సంతోష్ మాత దేవాలయంలో జరిగిన ఘటనలు భవిష్యత్తులో మరే ఇతర దేవాలయంలోనూ పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, GSI డివిజన్ పరిధిలోని అన్ని దేవాలయాల భద్రతను సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఎర్ర వినోద్ రెడ్డి పోలీసు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో GSI డివిజన్ జనరల్ సెక్రటరీ గోపాల్ శర్మ, బీజేపీ సీనియర్ నాయకులు సిద్దాల ఐలయ్య, రంగా రెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ పాల్వాయి సంజీవ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు బద్దం బాలకృష్ణ,బీజేపీ నాయకులు శ్రీనివాస్ నేత, నవీన్ రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు

# ఓబీసీల హక్కుల సాధనకు కాంగ్రెస్ కట్టుబాటు

## ఓబీసీ సింహగర్జనలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి




బాలాపూర్/బడంగ్‌పేట్: ఓబీసీ వర్గాల హక్కుల సాధన, రాజకీయ ప్రాధాన్యం, సర్వతోముఖ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్--గొల్లపల్లి రోడ్డులో ఓబీసీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓబీసీ సింహగర్జన' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఓబీసీ వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఓబీసీ కుల సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సభలో నాయకులు చేసిన ఉత్సాహభరిత ప్రసంగాలు పార్టీ శ్రేణుల్లో, ఓబీసీ వర్గాల్లో నూతన ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి. హనుమంతరావు, ఎంపీ మల్లు రవి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేసిన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, మండల, డివిజన్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలకు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు, ఓబీసీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆమె పేర్కొన్నారు.

## విడిపోయిన దంపతులను కలుపుతున్న పోలీసులు



ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : భార్యాభర్తల మధ్య తలెత్తే సమస్యలను పరిష్కరించి కుటుంబాలను తిరిగి కలపడమే పోలీస్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ లక్ష్యమని డీఎస్పీ జగన్నాథరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని పది పోలీస్‌స్టేషన్ల పరిధిలో భార్యాభర్తల మధ్య సమస్యలు ఉంటే ఆయా స్టేషన్ల ద్వారా కౌన్సిలింగ్ సెంటర్‌కు సమాచారం అందించవచ్చన్నారు. చిన్నపాటి గొడవలు, మాటపట్టింపులతో విడిపోయిన దంపతులకు కౌన్సిలింగ్ నిర్వహించి తిరిగి కలిపే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 67 మంది దంపతులకు కౌన్సిలింగ్ ఇవ్వగా 58 జంటలను తిరిగి కలిపినట్లు డీఎస్పీ వెల్లడించారు. కుటుంబ సమస్యల పరిష్కారానికి ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



ధర్మవరం, అక్టోబరు 5; (అరుణ ప్రభ న్యూస్) : ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం ధర్మవరం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రామభూపాల్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయంలోనూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. అర్జీదారులు తమ సమస్యలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, పరిష్కార వివరాల కోసం 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. పీజీఆర్ఎస్ సేవలు పొందిన అనంతరం మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. ప్రజా సంతృప్తి, పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు పీజీఆర్ఎస్‌లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. డివిజన్ పరిధి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శివానగర్ ఓవర్‌బ్రిడ్జితో బస్సుల రూట్ మార్పు



ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : శివానగర్‌లో ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో ధర్మవరం--బత్తలపల్లి మార్గంలో ఆర్టీసీ బస్సుల రూట్‌ను మార్చినట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం నుంచి బస్సులు ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగిస్తాయన్నారు. ధర్మవరం మార్కెట్ యార్డు పక్కనున్న రోడ్డు నుంచి సంఘం రోడ్డు, తిక్కస్వామినగర్, టీటీడీ కల్యాణ మండపం మీదుగా శివానగర్‌కు చేరుకునేలా కొత్త మార్గాన్ని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మార్గంలో బస్సులు రాను, పోను తిరుగుతాయన్నారు. కొత్త మార్గం వల్ల సుమారు 2.5 కిలోమీటర్ల దూరం పెరగడంతో బస్సు ఛార్జీ రూ.5 మేర పెరిగే అవకాశం ఉందని డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు మారిన మార్గాన్ని గమనించి ఆర్టీసీకి సహకరించాలని కోరారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు




ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : విద్యార్థులు కష్టపడి చదివి నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి పౌరులుగా ఎదిగి దేశసేవలో భాగ స్వాములు కావాలని ఎంఈఓలు రాజేశ్వరీదేవి, గోపాల్ నాయక్ అన్నారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా హిందూపురంలోని ఆల్ అమీన్ పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాయింగ్, వక్తృత్వ పోటీల్లో ధర్మవరం మండలానికి చెందిన బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని శరణ్య, ఏపీ మోడల్ కళాశాల బైపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని పి.వర్షిణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 127 మంది విద్యార్థులు పాల్గొనగా ఐదు విభాగాల్లో 15 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ధర్మవరం మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని ఎంఈఓలు పేర్కొన్నారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.



## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ శిక్షణ

ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షపై అవగాహన, శిక్షణ కల్పించేందుకు యూటీఎఫ్ ధర్మవరం డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారం బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సైకాలజీ, తెలుగు సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణనాయక్, జిల్లా కార్యదర్శి అమర్‌నారాయణరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మేరీవర కుమారి, పెనుకొండ యూటీఎఫ్ సీనియర్ నాయకుడు నారాయణస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కేంద్రం సూచనల మేరకు ఉపాధ్యాయులు టెట్‌లో ఉత్తీర్ణత సాధించేందుకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైకాలజీలో చాంద్‌బాషా, తెలుగులో రామకృష్ణ శిక్షణ ఇచ్చారు. అక్టోబరు 11 నుంచి జరగనున్న ప్రత్యేక టెట్‌కు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చిన చాంద్‌బాషా, రామకృష్ణలను యూటీఎఫ్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఆంజనేయులు, హెచ్.రామాంజనేయులు, పెద్దకోట్ల సురేష్, సకల చంద్రశేఖర్, వెంకటకిషోర్, ఆదినారాయణ, ఆదిశేషు, అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు నిర్వాహకులు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

# కోతుల దాడులతో బొప్పాపూర్ విలవిల!

**హామీలు కాగితాలకే పరిమితమా..?**

**కోతుల నుంచి రక్షించలేరా అంటూ గ్రామస్థుల ఆగ్రహం.**

**కోతుల దాడిలో వాటర్ ప్లాంట్ నిర్వాహకుడి కాలుకు ఫ్రాక్చర్.**

**మహిళలు, చిన్నారులు, వృద్ధులే టార్గెట్.. భయాందోళనలో గ్రామ ప్రజలు.**



ఎల్లారెడ్డిపేట అరుణప్రభ, అక్టోబర్ 04: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో కోతుల బెడద రోజు రోజుకూ మితిమీరుతోంది. ఇళ్లలోకి చొరబడు తున్న కోతులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుండగా.. వాటిని బయటకు తరిమేందుకు ప్ర యత్నిస్తున్న వారిపైనే దాడులకు తెగబడుతు న్నాయి. దీంతో గ్రామస్థులు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా, పిల్లలను ఆడుకోవడానికి పంపాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. తాజాగా గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న రామ బిక్షపతి ఇంట్లోకి కోతులు చొరబడగా, వాటిని బయటకు పంపించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఒక్కసారిగా కోతుల గుంపు ఆయనను తరమడంతో తప్పించుకునే ప్రయత్నంలో కాలుజారి కిందపడిపోయారు. ఈ ఘటనలో ఆయన కాలుకు ఫ్రాక్చర్ కావడంతో ప్రస్తుతం ఇంట్లోనే కాలికి పట్టీ వేసుకుని విశ్రాంతి తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

**కోతుల భయంతో.. బతుకు బండి సాగేదెలా?**

గ్రామంలో కోతుల బెడదతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పొలాలకు సద్దులు తీసుకెళ్లే మహిళలు, రైతులపై కోతులు దాడులు చేస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చిన్నారులు ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలోనూ కోతులు దాడులకు పాల్పడుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి వచ్చిన కోతులను వెళ్లగొట్టేందుకు ప్రయత్నించే వృద్ధులు, యువకులు, పురుషులపై కూడా కోతులు ఎదురుదాడికి దిగుతున్నాయని చెబుతున్నారు. దీంతో కోతులను చూసినా.. వాటిని తరిమినా.. గ్రామస్థులకు ప్రమాదమే అన్న పరిస్థితి నెలకొంది.

**గతంలో బావిలో పడిన రాజమ్మ..**

బొప్పాపూర్‌లో కోతుల బెడద కొత్తేమీ కాదని గ్రామస్థులు గుర్తుచేస్తున్నారు. గతంలో కురకాయలు విక్రయిస్తూ జీవనం సాగించే రాజమ్మ ఇంట్లో ఉండగా కోతుల గుంపు దాడికి పాల్పడింది. భయంతో పరుగులు తీసిన ఆమె ఇంట్లోని చేదబావిలో పడిపోయిన ఘటన అప్పట్లో కలకలం రేపింది. అదేవిధంగా ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చాకలి సామాజిక వర్గానికి చెందిన ఓ చిన్నారిపై కోతులు దాడి చేసి గాయపరిచిన ఘటన కూడా గ్రామంలో చోటుచేసుకుంది. ఇన్ని ఘటనలు జరిగినా కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

**హామీలు ఎన్నో.. పరిష్కారం ఎక్కడ?**

కోతుల బెడద నుంచి బొప్పాపూర్ ప్రజలకు విముక్తి కల్పిస్తామని గత సర్పంచ్ నుంచి ప్రస్తుత సర్పంచ్ వరకు పలుమార్లు హామీలు ఇచ్చినా.. అవి పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోతులను పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నామని, కోతులు పట్టే వారికి అడ్వాన్స్‌గా డబ్బులు కూడా ఇచ్చామని గ్రామపంచాయతీ పాలకవర్గం చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు. కోతులు పట్టేందుకు అడ్వాన్స్ ఇచ్చామంటే సరిపోతుందా..? ప్రజల కాళ్లు విరిగే వరకు వేచి చూడాలా..? అంటూ గ్రామస్థులు నిలదీస్తున్నారు. కోతుల గుంపుల స్వైరవిహారంతో ఇప్పటికే పలువురు గాయపడగా.. మరో పెద్ద ప్రమాదం జరిగేలోపు అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కోతుల బెడదను తక్షణమే నియంత్రించి, గ్రామ ప్రజలకు శాశ్వత రక్షణ కల్పించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో కోతుల బెడదపై గ్రామస్థుల ఆగ్రహం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు.

# ఆదర్శంగా నిలిచిన మల్కారం యువత

**ఏడు నెలలుగా నిలిచిపోయిన ధూప దీప నైవేద్యాలు పునరుద్ధరణ**

**సొంత ఖర్చులతో ఆలయ నిర్వహణకు ముందుకొచ్చిన యువత**



మల్కారం, అక్టోబర్ 4 (అరుణ ప్రభ -- శంషాబాద్ జోన్): మల్కారం గ్రామంలోని ప్రసిద్ధ హనుమాన్ దేవాలయంలో గత ఏడు నెలలుగా ధూప దీప నైవేద్యాలు నిలిచిపోవడంతో ఆలయానికి పూజా కార్యక్రమాలు సక్రమంగా జరగడం లేదని గుర్తించిన గ్రామ యువత స్పందించింది. ఆలయంలో నిత్య పూజలు కొనసాగాలని, దేవాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో యువత ముందుకు వచ్చింది. గ్రామానికి చెందిన యువకులు తమ సొంత డబ్బులతో ఆలయానికి పంతులును నియమించి, ప్రతి నెల ఆలయ ధూప దీప నైవేద్యాలకు సంబంధించిన ఖర్చులను స్వయంగా భరించేందుకు నిర్ణయించుకున్నారు. భక్తి, సామాజిక బాధ్యతతో యువత తీసుకున్న ఈ నిర్ణయం గ్రామంలో ప్రశంసలు అందుకుంటోంది. ఆలయంలో నిత్య పూజలు, ధూప దీప నైవేద్యాలు నిరంతరంగా జరిగేలా యువత తీసుకున్న చొరవను గ్రామ పెద్దలు, ప్రజలు అభినందించారు. గ్రామంలోని ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడేందుకు యువత ముందుకు రావడం ఆదర్శప్రాయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సురేందర్ రెడ్డి, కొత్త శ్రీనివాస్ రెడ్డి, కొత్త ప్రశాంత్ రెడ్డి, డిప్యూటీ సర్పంచ్ రోహిత్ కుమార్, వార్డు సభ్యులు కారుకొండ రవి, కొత్త రమాదేవి, గుండుమల స్వాతి, కొత్త సంజీవ రెడ్డితో పాటు గ్రామ ప్రజలు, యువతీ యువకులు మల్కారం యువతను అభినందించారు. "దేవాలయ సేవలో యువత భాగస్వామ్యం కావడం అభినందనీయం. ఆలయ పూజా కార్యక్రమాలు నిరంతరం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. మల్కారం యువత తీసుకున్న ఈ నిర్ణయం గ్రామంలోని ఇతర యువతకు కూడా స్ఫూర్తిగా

# అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరాలి: బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి**






బడంగ్‌పేట్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేయాలని ఏఐసీసీ ప్రచార విభాగం కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని 16వ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్ 57లో భాగమైన అల్మాస్‌గూడలో అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సులభంగా అందేలా ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా చేరే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన వారందరికీ అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, బంగారు సత్యనారాయణ, నవారు మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజు యాదవ్, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆ గ్రామంలో రాత్రయితే హడల్.. ఇళ్లపై రాళ్ల వర్షం.. అంతుచిక్కని మిస్టరీ!

**అనంతపురం జిల్లా అప్పాజీపేటలో వింత ఘటన**

**రాత్రిపూట ఇళ్లపై కురుస్తున్న రాళ్ల వర్షం.. పోలీసుల గస్తీ ఉన్నా ఆగని దాడులు**



అనంతపురం జిల్లాలోని ఓ గ్రామంలో చీకటి పడితే చాలు, ప్రజలు తీవ్ర భయాందోళనలతో వణికిపోతున్నారు. రాత్రి వేళ ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియని రాళ్లు ఇళ్లపై వర్షంలా కురుస్తుండటంతో, ఏం జరుగుతుందో అర్థంకాక బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఈ వింత ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. పామిడి మండలం పరిధిలోని అప్పాజీపేట గ్రామంలో గత వారం రోజులుగా ఈ అంతుచిక్కని ఉదంతం చోటుచేసుకుంటోంది. ప్రతిరోజూ రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇళ్లపై ఎవరో భారీ రాళ్లను విసురుతున్నారు. కొద్ది నిమిషాల వ్యవధిలో దాడులు పునరావృతం అవుతున్నాయి. గ్రామంలో చాలా ఇళ్లు రేకుల షెడ్లు కావడంతో, ఈ రాళ్ల దాడికి అవి దెబ్బతింటున్నాయి. ఈ ఘటనల్లో ఇద్దరు గ్రామస్థులకు స్వల్ప గాయాలయ్యాయి. మొదట ఇది ఆకతాయిల పనేనని భావించిన గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, గ్రామంలో నలుగురు కానిస్టేబుళ్లతో గస్తీ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు పోలీసులు పహారా కాసినా రాళ్ల దాడులు ఆగలేదు. దీంతో, గ్రామ యువకులు సుమారు 20 మంది పోలీసులతో కలిసి సమీపంలోని ఓ గుట్టపైకి ఎక్కి కాపలా కాశారు. అయినా సరే, వారు చూస్తుండగానే ఇళ్లపై రాళ్లు పడటంతో అంతా నివ్వెరపోయారు. పోలీసులు, యువకుల ప్రయత్నాలు విఫలం కావడంతో గ్రామస్థుల్లో భయం రెట్టింపైంది. చీకటి పడగానే ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకుంటున్నారు. కొందరు గ్రామస్థులు ఇది దెయ్యాలు లేదా ఇతర అతీత శక్తుల పనేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాము కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నామని, అధికారులు స్పందించి ఈ మిస్టరీని ఛేదించి తమను కాపాడాలని వేడుకుంటున్నారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని గ్రామాల్లోనూ ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. 2024లో తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఓ గ్రామంలో కూడా ఇలాగే ఇళ్లపై రాళ్లు పడిన ఉదంతం సంచలనం సృష్టించింది. ప్రస్తుతానికి అప్పాజీపేటలో ఈ రాళ్ల దాడి మిస్టరీ వీడకపోవడంతో, గ్రామస్థులు భయంతోనే కాలం గడుపుతున్నారు.

## సీఎం పర్యటనతో ఐదు ఆర్టీసీ సర్వీసులు రద్దు



ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : ప్రొద్దుటూరులో అక్టోబరు 5న ముఖ్యమంత్రి కార్యక్రమం నేపథ్యంలో ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి నడిచే ఐదు బస్సు సర్వీసులను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. సీఎం కార్యక్రమానికి బస్సులను కేటాయించాల్సి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రద్దయిన సర్వీసుల్లో ఉదయం 4.30 గంటలకు తిరుపతి, 4.45 గంటలకు శ్రీశైలం, 7.15 గంటలకు శ్రీశైలం, 5 గంటలకు నంద్యాల, 5 గంటలకు మంత్రాలయం బస్సులు ఉన్నాయి. తెల్లవారుజామున బయలుదేరే సర్వీసులు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.



## రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ధర్మవరం క్రీడాకారిణి చైత్ర

ధర్మవరం, అక్టోబరు 4; (అరుణ ప్రభ న్యూస్) : ధర్మవరం పట్టణానికి చెందిన ముత్యాల చైత్ర ఎస్‌జీఎఫ్ అండర్-17 జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపికల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపికల్లో చైత్ర ప్రతిభను చాటింది. చైత్ర తండ్రి ఎం. రాజేంద్రప్రసాద్ ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. క్రికెట్‌పై ఆసక్తి ఉన్న చైత్రకు మెరుగైన శిక్షణ అందించేందుకు కుటుంబం రెండేళ్ల క్రితం ధర్మవరం నుంచి అనంతపురానికి మారింది. అనంతపురంలోని ఆర్డీటీ ఏడీసీఏ క్యాంపులో కోచ్‌లు జోషి కుమార్, యుగేందర్‌రెడ్డి వద్ద చైత్ర శిక్షణ పొందుతోంది. రెండేళ్లుగా క్రమం తప్పకుండా శిక్షణ తీసుకుంటూ ఆటలో ప్రతిభను మెరుగుపరుచుకుంది. రాష్ట్రస్థాయితో పాటు జాతీయస్థాయి పోటీల్లోనూ చైత్ర రాణించాలని ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. చైత్రకు కుటుంబ సభ్యులు, కోచ్‌లు, క్రీడాభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.





## ఘనంగా పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి

**సమాధి వద్ద నివాళులర్పించిన సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డి**

బడంగ్‌పేట్/బాలాపూర్: స్వర్గీయ మాజీ హోంమంత్రి, మాజీ విద్యాశాఖ మంత్రి, ప్రజానాయకుడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో ఉన్న ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆమె తనయుడు, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి సామ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పట్లోళ్ల ఇంద్రారెడ్డి ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, నిరంతరం ప్రజా సంక్షేమం కోసం కృషి చేసిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు, సమాజ అభ్యున్నతికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఇంద్రారెడ్డి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేసిన ఇంద్రారెడ్డి సేవలను ఎప్పటికీ మరువలేమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆయన ప్రజా జీవితాన్ని, సేవా స్ఫూర్తిని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.



## ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం

**బాణం గుర్తుకు ఓటు వేసి**

**టీయూడబ్ల్యూను గెలిపించాలి: పారిజాత నర్సింహారెడ్డి**

బడంగ్‌పేట్: టీజీఎస్ఆర్టీసీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. టీయూడబ్ల్యూ నాయకుడు మొగుళ్ల రాజిరెడ్డితో కలిసి రాజేంద్రనగర్, మిధాని, హయత్‌నగర్ ఆర్టీసీ డిపోలను సందర్శించి కార్మికులు, ఉద్యోగులను కలిశారు. ఈ సందర్భంగా ఆయా డిపోల్లో కార్మికులతో సమావేశమైన పారిజాత నర్సింహారెడ్డి, వారి సమస్యలు, హక్కుల సాధనకు టీయూడబ్ల్యూ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటం అవసరమని పేర్కొన్నారు. గుర్తింపు ఎన్నికల్లో కార్మికులంతా ఐక్యంగా నిలిచి టీయూడబ్ల్యూకు మద్దతు తెలపాలని కోరారు. టీయూడబ్ల్యూ అధికారిక గుర్తు అయిన బాణం గుర్తుకు ఓటు వేసి సంఘాన్ని భారీ మెజారిటీతో గెలిపించాలని పారిజాత నర్సింహారెడ్డి, మొగుళ్ల రాజిరెడ్డి కార్మికులు, ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో టీయూడబ్ల్యూ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
www.arunaprabha.com
తెలుగు దినపత్రిక
సోమవారం, అక్టోబరు 5, 2026

# సర్కిల్-49లో అక్రమ నిర్మాణాలపై చర్యలెక్కడ?

## జి+2 అనుమతులతో ఏడంతస్తుల నిర్మాణాలంటూ స్థానికుల ఆరోపణలు
## ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా స్పందన కరువు.. టీపీఓ అక్బర్ తీరుపై ప్రశ్నలు






శేరిలింగంపల్లి, అక్టోబర్ 4 (అరుణ ప్రభ): శేరిలింగంపల్లి సిఎంసీ సర్కిల్--49 పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా సంబంధిత అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా శ్రీరామ్‌నగర్ కాలనీ బి-బ్లాక్‌లో అనుమతులకు విరుద్ధంగా భారీ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. శ్రీరామ్‌నగర్ బి--బ్లాక్‌లోని ప్లాట్ నంబర్లు 643, 644కు సంబంధించి జి+2 నిర్మాణాలకు అనుమతులు తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రెండు, మూడు అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు తీసుకుని ఏకంగా ఏడంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజావాణిలోనూ ఫిర్యాదులు చేసినట్లు చెబుతున్నారు. అయితే ఫిర్యాదులు అందినప్పటికీ నిర్మాణాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటన్నది స్పష్టంగా తెలియడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందినప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో సర్కిల్--49 టీపీఓ అక్బర్ తీరుపైనా స్థానికులు పలు ఆరోపణలు, అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయితే టీపీఓ అక్బర్ అక్రమ నిర్మాణాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలకు ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ లేదు. దీనిపై సంబంధిత అధికారి వివరణ ఇస్తేనే వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఒకవైపు అక్రమ నిర్మాణాలను అరికడతామని సిఎంసీ అధికారులు చెబుతుండగా, మరోవైపు తమ ప్రాంతంలో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తుండటంతో అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నారు? క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిగాయా? నిర్మాణాలకు మంజూరైన అనుమతులు, ప్రస్తుతం నిర్మించిన అంతస్తులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? ఉల్లంఘనలు ఉంటే ఎందుకు చర్యలు తీసుకోలేదు? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సిఎంసీ ఉన్నతాధికారులు శ్రీరామ్‌నగర్ బి--బ్లాక్‌లోని ప్లాట్ నంబర్లు 643, 644పై సమగ్ర విచారణ జరిపి, అనుమతులు--నిర్మాణాల వాస్తవ పరిస్థితిని పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను అధికారులు బహిర్గతం చేస్తారా? లేక ఈ వ్యవహారం కూడా ఫైళ్లకే పరిమితమవుతుందా? అనేది వేచి చూడాల్సిన పరిస్థితి


టీపీఓ. అక్బర్

# పాలడుగు కౌసల్య స్మృతికి కుటుంబ సభ్యుల ఘన నివాళి

## ద్వితీయ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం





చౌదరిగూడ: పాలడుగు బుగ్గా రెడ్డి సతీమణి పాలడుగు కౌసల్య ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు. చౌదరిగూడలోని రామాలయం సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌసల్య స్మారకార్థం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కౌసల్యతో తమకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో ఎంతో ఆప్యాయంగా మెలిగేవారని, బంధువులు, స్నేహితులతో స్నేహభావంతో ఉంటూ అందరినీ ఆత్మీయంగా పలకరించేవారని గుర్తుచేసుకుంటూ స్మరించుకున్నారు. ఆమె భౌతికంగా దూరమైనప్పటికీ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల హృదయాల్లో ఆమె జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ద్వితీయ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు కౌసల్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాలడుగు శ్రీనివాస్ రెడ్డి, మాధవ రెడ్డి, భీం రెడ్డి, నరేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, పులకంటి మోహన్ రెడ్డి, రమణారెడ్డి, దామోదర్ రెడ్డితో పాటు పాలడుగు కుటుంబ సభ్యులు, తోబుట్టువులు, ఆడపడుచులు, బంధుమిత్రులు, సన్నిహితులు తదితరులు పాల్గొన్నారు.

# జాయింట్ అకౌంట్‌లో ఒకరు మరణిస్తే.. డబ్బులు ఎవరికి చెందుతాయి?

## మిగిలిన ఖాతాదారుడు నగదు తీసుకోవచ్చా? నామినీకి పూర్తి హక్కులు ఉంటాయా? బ్యాంకు నిబంధనలు, వారసత్వ చట్టాలపై తెలుసుకోండి



హైదరాబాద్: భార్యాభర్తలు, కుటుంబ సభ్యులు లేదా ఇతర వ్యక్తులు కలిసి నిర్వహించే జాయింట్ బ్యాంకు ఖాతాలు ఆర్థిక లావాదేవీలను సులభతరం చేస్తాయి. అయితే ఖాతాదారుల్లో ఒకరు మరణించినప్పుడు ఆ ఖాతాలోని నగదుపై హక్కు ఎవరికి ఉంటుంది? బతికున్న మరో ఖాతాదారుడు మొత్తం డబ్బును విత్‌డ్రా చేసుకోవచ్చా? నామినీకి ఆ సొమ్ము చెందుతుందా? అనే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. ఈ విషయంలో బ్యాంకు నిబంధనలకు, వారసత్వ చట్టాల ప్రకారం ఉండే హక్కులకు మధ్య వ్యత్యాసాన్ని తెలుసుకోవడం ముఖ్యం. జాయింట్ ఖాతాను తెరిచే సమయంలో ఖాతాదారులు ఎంచుకున్న నిర్వహణ విధానం ఆధారంగా ఒకరు మరణించినప్పుడు నగదు చెల్లింపు ప్రక్రియ ఉంటుంది. 'ఈదర్ ఆర్ సర్వైవర్' వంటి నిబంధనతో ఖాతా నిర్వహిస్తుంటే, ఖాతాదారుల్లో ఒకరు మరణించిన తర్వాత బతికున్న ఖాతాదారుడు బ్యాంకును సంప్రదించి అవసరమైన పత్రాలు సమర్పించడం ద్వారా ఖాతాలోని నగదును పొందవచ్చు. అయితే బ్యాంకు డబ్బును విడుదల చేయడం వల్ల ఆ సొమ్ముపై పూర్తి చట్టబద్ధమైన యాజమాన్య హక్కు కూడా లభించినట్లు కాదు. మరణించిన వ్యక్తి ఖాతాలో జమ చేసిన సొమ్ములో కొంత లేదా మొత్తం ఆయనకు చెందినదైతే, సంబంధిత వారసత్వ చట్టాల ప్రకారం చట్టబద్ధమైన వారసులకు కూడా ఆస్తిపై హక్కులు ఉండవచ్చు. అందువల్ల బతికున్న ఖాతాదారుడు డబ్బును స్వీకరించినప్పటికీ, ఇతర వారసుల చట్టబద్ధమైన హక్కులను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. జాయింట్ ఖాతాదారులందరూ మరణించినప్పుడు లేదా వ్యక్తిగత ఖాతాదారుడు మరణించినప్పుడు, బ్యాంకు నిబంధనల ప్రకారం నామినీకి నగదును చెల్లించే అవకాశం ఉంటుంది. నామినీగా పేరు నమోదు చేసినంత మాత్రాన ఆ సొమ్ముపై పూర్తి యాజమాన్య హక్కులు వచ్చినట్లు కాదు. సాధారణంగా నామినీ బ్యాంకు నుంచి డబ్బును స్వీకరించేందుకు అధికారం పొందుతారు. ఆ సొమ్ముపై తుది హక్కులు మాత్రం వర్తించే వారసత్వ చట్టాలు, వీలునామా, ఆస్తి యాజమాన్యానికి సంబంధించిన వివరాల ఆధారంగా నిర్ణయమవుతాయి. ఇతర చట్టబద్ధమైన వారసులకు హక్కులు ఉన్నట్లయితే, వారు తమ వాటా కోసం న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించవచ్చు. బ్యాంకింగ్ నిబంధనల ప్రకారం, సరైన నామినీకి లేదా సర్వైవర్ నిబంధన కింద అర్హత కలిగిన ఖాతాదారుడికి అవసరమైన పత్రాలను పరిశీలించిన తర్వాత బ్యాంకు నగదును విడుదల చేయవచ్చు. ఇలా చెల్లింపు చేయడం ద్వారా సాధారణంగా బ్యాంకు తన చెల్లింపు బాధ్యత నుంచి విముక్తి పొందుతుంది. అయితే ఆ నగదుపై వారసుల మధ్య వివాదాలు ఉంటే వాటిని పరిష్కరించే బాధ్యత బ్యాంకుది కాదు. అలాంటి సందర్భాల్లో సంబంధిత వ్యక్తులు చట్టపరమైన పరిష్కారం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి రావచ్చు. జాయింట్ ఖాతాలోని డిపాజిట్లపై వచ్చే వడ్డీకి సంబంధించి ఆదాయపు పన్ను బాధ్యత కూడా ముఖ్యమైన అంశం. ఖాతాలో మొదటి పేరు ఉన్న వ్యక్తి పాన్ వివరాల ఆధారంగా బ్యాంకు టీడీఎస్ మినహాయించే సందర్భాలు ఉంటాయి. అయితే వడ్డీ ఆదాయంపై పన్ను చెల్లించాల్సిన బాధ్యత కేవలం మొదటి ఖాతాదారుడికే పరిమితం కాదు. వాస్తవంగా ఆ డిపాజిట్‌కు నిధులు సమకూర్చిన వ్యక్తి, సొమ్ముపై యాజమాన్య హక్కులు, వర్తించే పన్ను నిబంధనలను బట్టి ఆదాయాన్ని ఎవరికి ఆపాదించాలనేది నిర్ణయమవుతుంది. ఆదాయపు పన్ను నిబంధనల్లోని సెక్షన్ 199, రూల్ 37బీఏ ప్రకారం, నిర్దిష్ట అర్హతలు, ప్రక్రియలకు అనుగుణంగా టీడీఎస్ క్రెడిట్‌ను సంబంధిత ఆదాయాన్ని ప్రకటించే వ్యక్తికి బదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. ఇందుకోసం అవసరమైన డిక్లరేషన్‌ను బ్యాంకుకు సమర్పించాల్సి రావచ్చు. వడ్డీ ఆదాయాన్ని తమ ఆదాయపు పన్ను రిటర్నుల్లో సరైన విధంగా చూపించడం ఖాతాదారులకు ముఖ్యం. జాయింట్ ఖాతా తెరిచే సమయంలోనే ఖాతాదారులు నిర్వహణ విధానం, నామినీ వివరాలు, నగదుపై హక్కులకు సంబంధించిన అంశాలను స్పష్టంగా తెలుసుకోవాలి. ఖాతాలో ఎవరు ఎంత మొత్తాన్ని జమ చేశారు? ఆ సొమ్ముపై ఎవరి యాజమాన్య హక్కులు ఉన్నాయి? అనే వివరాలకు సంబంధించిన ఆధారాలను భద్రపరచుకోవడం భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ఉపయోగపడుతుంది. వీలునామా రాయడం, ఆస్తుల పంపిణీపై స్పష్టత ఇవ్వడం కూడా అవసరాన్ని బట్టి పరిశీలించాలి.

మొత్తంగా.. జాయింట్ ఖాతాదారుల్లో ఒకరు మరణించినప్పుడు బతికున్న మరో ఖాతాదారుడు బ్యాంకు నిబంధనల ప్రకారం డబ్బును తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ సొమ్ముపై పూర్తి యాజమాన్య హక్కు ఆటోమేటిక్‌గా లభించదు. నామినీ విషయంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది. బ్యాంకు నుంచి నగదును పొందే హక్కు, ఆస్తిపై తుది చట్టబద్ధమైన హక్కు రెండూ వేర్వేరు అంశాలని గుర్తుంచుకోవాలి. వారసుల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు న్యాయ నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం.



## ఉద్యమ త్యాగాలకు గుర్తింపు ఏదీ?.. హామీల అమలుకు ఉద్యమకారుల డిమాండ్

### తెలంగాణ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు - 18 వ రోజు

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ ఆధ్వర్యంలో, ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 18 వ రోజుకు చేరుకున్నాయి. ఈరోజు ముఖ్యఅతిథిగా హుజురాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ అవునూరి సమయ్య పాల్గొన్నారు. ఈరోజు దీక్షలో.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉద్యమ కారులు.. గంగాధర్, భాస్కర్ గౌడ్, సంజీవరెడ్డి, సత్యనారాయణ, బసవరాజు, బి.పరమేశ్వర్ కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో పటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, అనంతుల సంతోష్, డోలి సుధీర్, భాస్కర్, నర్సింహా నగేష్ ,తదితరులు పాల్గొని ఉద్యమకారులకు సంఘీభావం తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.



## సేవా సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

అల్వాల్: సేవా సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో ఓల్డ్ అల్వాల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరంతో పాటు జనరల్ ట్రీట్మెంట్ క్యాంపును నిర్వహించారు. 192వ డివిజన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, సచిన్ గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ ఆసుపత్రి సౌజన్యంతో, జూనియర్ వైద్యుల సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో బీజేపీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న రక్తదాతలకు అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. అదేవిధంగా జనరల్ ట్రీట్మెంట్ శిబిరంలో వైద్యులు పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు రక్తదానంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యవర్గ సభ్యులు పరాంకుశం మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉదయ్, శాస్త్రి, రాంసింగ్, భరత్, రాజు, చరణ్, సర్వేశ్వరరావు, సాయి విశ్వేశ్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రైవేట్ బ్యాంకులు స్వచ్ఛందంగా ఐదు రోజుల పనివారాన్ని అమలు చేయవచ్చా?

హైదరాబాద్: బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్ చాలాకాలంగా కొనసాగుతోంది. ఉద్యోగులపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించడంతోపాటు, వ్యక్తిగత జీవితానికి తగిన సమయం కేటాయించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని బ్యాంకు ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఈ విధానం అమలుపై స్పష్టత కోసం ఉద్యోగులు ఎదురుచూస్తుండగా, ప్రైవేట్ బ్యాంకులు మాత్రం తమంతట తాముగా ఐదు రోజుల పనివారాన్ని అమలు చేయవచ్చా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం దేశంలోని చాలా బ్యాంకులు ఆదివారంతోపాటు రెండో, నాలుగో శనివారాల్లో మాత్రమే పనిచేయవు. మిగిలిన శనివారాల్లో సాధారణ కార్యకలాపాలు కొనసాగిస్తాయి. అన్ని శనివారాలూ సెలవులు ప్రకటించి, వారానికి ఐదు రోజుల పనివారాన్ని అమలు చేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఈ విధానం వల్ల ఉద్యోగుల పని ఒత్తిడి తగ్గడంతోపాటు, మెరుగైన పనితీరు సాధ్యమవుతుందని అభిప్రాయపడుతున్నాయి. బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ ఉద్యోగుల పనిభారం మాత్రం తగ్గడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఖాతాదారులకు సేవలు అందించడంతోపాటు రుణాల లక్ష్యాలు, పరిపాలనా వ్యవహారాలు, నగదు నిర్వహణ, ఇతర కార్యాలయ పనులను కూడా ఉద్యోగులు పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో అనేక సందర్భాల్లో నిర్ణీత పని వేళలు ముగిసిన తర్వాత కూడా విధులు నిర్వహించాల్సి వస్తోందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. మరోవైపు యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎంల వినియోగం పెరగడంతో ఖాతాదారులు చిన్నచిన్న లావాదేవీల కోసం బ్యాంకు శాఖలకు వెళ్లాల్సిన అవసరం తగ్గింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు ఐదు రోజుల పనివారాన్ని అమలు చేయడం ద్వారా పని, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత సాధించవచ్చని సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రైవేట్ బ్యాంకులు తమ ఉద్యోగులకు ఐదు రోజుల పనివారాన్ని అమలు చేయాలనుకుంటే, కేవలం యాజమాన్య నిర్ణయంతోనే అన్ని శనివారాలకు సెలవులు ప్రకటించలేవు. బ్యాంకుల పని వేళలు, సెలవులకు సంబంధించి అమల్లో ఉన్న చట్టాలు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు, సంబంధిత అధికారుల ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా బ్యాంకు శాఖలను అన్ని శనివారాల్లో మూసివేయాలనుకుంటే, వర్తించే నిబంధనల ప్రకారం అవసరమైన అనుమతులు పొందాలి.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
సోమవారం, అక్టోబరు 5, 2026

# తెలుగు తెరపై మితిమీరుతున్న హింస

‘తెలుగు సినిమా’ అంటే ఒకప్పుడు కుటుంబ భావోద్వేగాలు, ఆహ్లాదకరమైన హాస్యం, మంచి పాటలు, చివర్లో ధర్మం గెలిచే సాధారణ యాక్షన్ సన్నివేశాలు ఉండేవి. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ‘వైలెన్స్ ఈజ్ ప్యాషన్.. వైలెన్స్ ఈజ్ ఫ్యాషన్’ అనే విధంగా మన హీరోలు, దర్శక రచయితలు వెండితెరను రక్తసిక్తం చేస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాలంటే కత్తి వేటు, తలలు తెగడం, రక్తం ఏరులై పారడం తప్పనిసరి అనేంతగా వాతావరణం మారిపోయింది. సినిమాలో హీరో వీరోచితంగా పోరాడాలని, విలన్లపై గెలవాలని ప్రతీ ప్రేక్షకుడు కోరుకుంటాడు. ఒకప్పటి సినిమాలలో విలన్ క్రూరుడిగా ఉంటే, హీరో చివరికి అతడిని చట్టానికి పట్టించడమో లేక కనీస హద్దుల్లో శిక్షించడమో చూసేవాళ్లం. అదే అప్పట్లో హీరోయిజం. కానీ ఇప్పుడు కథ మారింది. విలన్ దుర్మార్గాన్ని తెరపై ఎస్టాబ్లిష్ చేయడానికి దర్శకులు అతడితో అత్యంత అమానవీయమైన పనులు చేయిస్తున్నారు.. ప్రతినాయకుడి పాత్రను క్రూరంగా చిత్రీకరిస్తున్నారు. దానికి ప్రతీకారంగా హీరో అంతకంటే వంద రెట్లు క్రూరంగా మారి విలన్ గ్యాంగ్‌ను నరికి పారేస్తున్నాడు. “హీరో ఎంత రాక్షసంగా మారితే థియేటర్లో అన్ని విజిల్స్” అనే ప్రమాదకరమైన ఫార్ములా ఈ మధ్య కాలంలో మొదలైంది. భావోద్వేగాల బలం తగ్గడంతో, ఆ లోటును భర్తీ చేయడానికి మితిమీరిన రక్తపాతాన్ని తెరపై నింపుతున్నారు. కత్తులు, కొడవల్లు, గొడ్డళ్లు, సుత్తులు, పెద్ద పెద్ద మెషిన్ గన్లు, విచక్షణారహితంగా నరుక్కునే సన్నివేశాలే ఇప్పుడు కథకు ప్రధాన ఆకర్షణగా మారుతున్నాయి. మనిషిని నిలువునా చీల్చడం.. తలలు తెగ నరకడం.. చేతులు, కాళ్లు కోసేయడం.. ఒంట్లో కత్తి పోటు దింపి అవయవాలను తురమడం.. గొడ్డలి వేటుతో శరీరాన్ని నుజ్జు నుజ్జు చెయ్యడం.. తలలు నరికి రక్తాన్ని పెద్ద పాత్రలో పట్టి ఆ రక్తాన్ని జనం మీదికి చల్లడం.. ఇప్పుడు సినిమాల్లో ఇలాంటి సన్నివేశాలు కనిపిస్తున్నాయి. ఎంత కాదన్నా సమాజంపై ‘సినిమా’ ప్రభావం ఉంటుంది. ప్రత్యేకించి యుక్తవయసులో ఉన్న యువతపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. రక్తపాతాన్ని స్టైల్‌గా చూపించడం.. సిగరెట్ పొగలు కక్కుతూ, నెత్తురు చిందిస్తూ నడిచే హీరో పాత్రను స్టైలిష్‌గా, ‘ఆల్ఫా మేల్’గా ప్రొజెక్ట్ చేయడం వల్ల హింస అనేది మామూలు విషయంగా మారిపోయే ప్రమాదం లేకపోలేదు. సెన్సార్ బోర్డ్ ఎంత అడ్డుకట్ట వేసినా.. ఓటీటీలు, యూట్యూబ్ రీల్స్ ద్వారా రక్తపాత విజువల్స్ ఎలాంటి నియంత్రణ లేకుండా పిల్లల చేతుల్లోకి వెళ్తున్నాయి. ఇది వారిని చెడు మార్గంలోకి తీసుకెళ్లే అవకాశం లేకపోలేదు. ఒకప్పుడు సినిమాల్లో మనిషి ప్రాణం పోతుంటే ఒకప్పుడు గుండె భారమయ్యేది.. కానీ ఇప్పుడు వినోదంగా చూసి చప్పట్లు కొడుతున్నారు. నిజ జీవితంలో ప్రమాదాలు, ఘోరాలు జరిగినప్పుడు సాయం చేయకుండా జనాలు వీడియోలు తీసుకుంటున్నారంటే.. వీటి వెనుక సినిమాల ప్రభావం ఎంతో కొంత ఉంటుందనేది ఎవరూ కాదనలేని వాస్తవం.





# దసరా విన్నింగ్‌రేస్‌లో ముందున్నదెవరు?

తెలుగు నాట పండుగ వచ్చిందంటే థియేటర్ల వద్ద సందడి మామూలుగా ఉండదు. అయితే ఈసారి దసరా సందర్భంగా బాక్సాఫీస్ సమరం సాధారణ పోటీని మించి పెద్ద తుఫానునే సృష్టించబోతోంది. ఒకవైపు రూ.600 కోట్ల మార్కును దాటిన రికార్డుతో ఇటీవలే ‘జైలర్ 2’ వస్తుంటే.. మరోవైపు కెరీర్‌లోనే అత్యంత భారీ పీరియాడిక్ ప్రాజెక్ట్‌గా విజయ్ దేవరకొండ ‘రణబలి’తో ఢీకొట్టేందుకు రెడీ అయ్యాడు. వీరికి తోడు పండుగ పూట కుటుంబ ప్రేక్షకులకు కేరాఫ్ అడ్రెస్ గా నిలిచే విక్టరీ వెంకటేష్, కంటెంట్ నమ్ముకుని వచ్చే శ్రీ విష్ణు కూడా బరిలో ఉండటంతో ఈ దసరా పందెంలో అసలు విన్నర్ ఎవరు నిలుస్తారన్నది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. ఈ దసరా పోరులో అత్యంత సెన్సేషనల్ ఎలిమెంట్ విజయ్ దేవరకొండ వర్సెస్ రజనీకాంత్ సమరమే. గతంలో ‘కింగ్‌డమ్’తో మాస్ హీరోగా నిలదొక్కుకోవాలని చూసిన విజయ్‌కు ఆశించిన ఫలితం దక్కలేదు. దీంతో ఎలాగైనా సరే సాలిడ్ మాస్ స్టార్‌డమ్ దక్కించుకోవాలనే కసితో ‘టాక్సీవాలా’ తర్వాత మరోసారి డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్‌తో చేతులు కలిపాడు. బ్రిటిష్ కాలం నాటి స్టోరీతో, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ‘రణబలి’ కోసం కత్తిసాము, గుర్రపు స్వారీలో ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నాడు. పైగా లక్ష్యంగా పెట్టుకున్న రివార్డును సాధించేందుకు సినిమా మీద అంచనాలను పెంచేసింది. అయితే సెప్టెంబర్ 11 నుంచి వాయిదా పడి అక్టోబర్ 16కి వస్తున్న ‘రణబలి’కి తమిళనాడులో రజనీకాంత్ ‘జైలర్ 2’ అతిపెద్ద అడ్డంకిగా మారనుంది. సూపర్ స్టార్ హవాను తట్టుకుని తమిళంలో నిలవడం కష్టమేనా, తెలుగు బాక్సాఫీస్‌పై విజయ్ సత్తా చూపిస్తాడా అన్నది ఆసక్తికరంగా మారింది. విజయ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకం కానుంది.



# అక్టోబర్ 9న తెలుగులో హనుమాన్ అంశ్

కొన్ని సినిమాలు విడుదలైన వెంటనే ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. మరికొన్ని సినిమాలు రోజులు గడిచేకొద్దీ మౌత్ టాక్‌తో మరింత బలపడతాయి. ‘హనుమాన్ అంశ్’ కూడా అలాంటి చిత్రమే. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా, భక్తులు ప్రేమగా మహారాజ్-జీ అని పిలుచుకునే ఆయన జీవితం, బోధనల స్ఫూర్తితో రూపొందిన ఈ హిందీ చిత్రం.. ఈ ఏడాదిలో అనూహ్య విజయాన్ని అందుకున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. పరిమిత స్థాయిలో తెరకెక్కిన ఈ సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. విశ్వాసం, భక్తి, ఆధ్యాత్మిక పరివర్తన వంటి అంశాలు అన్ని తరాల ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. డాక్టర్ విశాల్ చతుర్వేది రచన, దర్శకత్వంలో ‘హనుమాన్ అంశ్’ తెరకెక్కింది. నీమ్ కరోలి బాబా పాత్రలో శోబినావ్ సత్యా నటించారు. చందన్ ఆనంద్, పూర్ణిమా తివారీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. శ్రేయాస్ ధర్మాధికారి సంగీతాన్ని అందించగా, రిషి పాఠక్ కూడా సంగీత దర్శకుడిగా క్రెడిట్ పొందారు. ఆధ్యాత్మికతతో నిండిన కథకు సంగీతం మరింత బలాన్ని చేకూర్చింది. హిందీలో విజయవంతమైన థియేట్రికల్ జర్నీ అనంతరం ఇప్పుడు ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. హోంబలే ఫిల్మ్స్ తమ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ విభాగం ద్వారా గతంలో ‘హనుమాన్ అంశ్’ను అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేసింది. ఇప్పుడు సౌత్ ఇండియన్ భాషల థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకుని.. ఈ చిత్రాన్ని దక్షిణాది ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది.

# మరకతమణి 2 షూటింగ్ పూర్తి



ఆది పినిశెట్టి హీరోగా నటించిన బ్లాక్ బస్టర్ ‘మరకతమణి’. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్ గా వస్తున్న‘మరకతమణి 2’ షూటింగ్ పూర్తయిందని మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2017లో విడుదలైన ఒరిజినల్ చిత్రం తమిళం, తెలుగులో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ఫ్రాంచైజీ అభిమానులకు ఇప్పటికీ గుర్తుండిపోయే ఎన్నో మధురమైన జ్ఞాపకాలను అందించింది. వివిధ భాషల ప్రేక్షకులను తన నటనతో మెప్పించిన ఆది కెరీర్‌లో కూడా ఈ సినిమాకు ప్రత్యేక స్థానం ఉంది. సీక్వెల్ ప్రకటించినప్పటి నుంచి అభిమానులతో పాటు ట్రేడ్ వర్గాలు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఈ అంచనాలు రోజురోజుకూ మరింత పెరుగుతున్నాయి. ఒరిజినల్ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు ఏఆర్‌కే శరవణ్ ఈ ఫ్రాంచైజీతోనే కొనసాగుతున్నారు. ఈ ప్రయాణంలోని ప్రతి దశలోనూ ఆయన భాగస్వామిగా ఉన్నారు. అభిమానులు సీక్వెల్‌పై పెట్టుకున్న అంచనాలను అందుకునేలా రెండో భాగాన్ని రూపొందించేందుకు ఆయన ప్రత్యేకంగా కృషి చేశారు.



# సింగీతంకు కన్నీటి వీడ్కోలు.. చెన్నైలో ముగిసిన అంత్యక్రియలు

భారతీయ సినీ యవనికపై తనదైన ముద్ర వేసిన విలక్షణ దర్శకుడు, లెజెండరీ ఫిలిమేకర్ సింగీతం శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. చెన్నైలో ఆదివారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు చెన్నైలోని నేసపాక్కం శ్మశానవాటికలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సినీ ప్రముఖుల అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. భారతీయ సినిమాకు దశాబ్దాల పాటు విశేష సేవలందించిన ఓ మహోన్నత అధ్యాయం ఆయన మరణంతో ముగిసినట్లయింది. వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సింగీతం శ్రీనివాసరావు (94), చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. అనంతరం ఆయన భౌతికకాయాన్ని చెన్నై విరుగంబాక్కంలోని ఆయన నివాసానికి తరలించారు. ఆదివారం ఉదయం నుంచి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. సింగీతంతో ఎన్నో చారిత్రక చిత్రాల్లో పనిచేసిన విశ్వనటుడు కమల్ హాసన్, ఆయన నివాసానికి చేరుకుని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సింగీతం కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సింగీతం మరణం పట్ల భారతీయ సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు వంటి ఎందరో అగ్ర తారలు, సాంకేతిక నిపుణులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. భారతీయ సినిమాలో ప్రయోగాలకు, నూతన ఒరవడులకు సింగీతం శ్రీకారం చుట్టారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని కొనియాడారు.

CORPORATE OFFICE: SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267, HUDA SAI NAGAR COLONY,
BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070. TG. CELL. 9348313999/8885727777.

EDITED, PRINTED, PUBLISHED & OWNED BY GURRAM PAPI REDDY, # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501511. TELANGANA. PRINTED AT: GARUDA PRINT-ERS, # H.NO.2-86/1, PLOT NO.23-SP, SYNO.417, SAGAR HIGHWAY, RANGANNAGUDA VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT.501510. TELANGANA. PUBLISHED AT: # H.NO.4-57, THORRUR VILLAGE, ABDULLAPURMET MANDAL, TURKAYAMJAL MUNICIPALITY, RANGA REDDY DISTRICT. 501511. TELANGANA....WWW.ARUNAPRABHA.COM.EMAIL.ARUNAPRABHADAILY@GMAIL.COM, RNI NO. TELTEL/2023/89778, CELL NO. 9700127889.